
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY ఖమ్మం KHAMMAM
ఆదివారం, 7 సెప్టెంబరు 2025



ఖమ్మం మున్నేటి వద్ద నిమజ్జనానికి క్రేన్ సహాయంతో తరలిస్తున్న దృశ్యం


నిమజ్జనానికి శోభాయాత్రగా తరలివస్తున్న విగ్రహాలు

బై బై గణేశా....

తల్లి చెంతకు చేరిన తనయుడు

- కన్నులపండువగా సాగిన శోభాయాత్ర
- డప్పు వాయిద్యాలు, భజనలతో మార్మోగిన వీధులు
- ఖమ్మం మున్నేటిలో నిమజ్జమైన 2 వేలకు పైగా విగ్రహాలు

ఖమ్మం ఖానాపురంహవేలి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నవరాత్రులు ముగిశాయి. ఘనంగా పూజలందుకున్న ఆ బొజ్జ గణపయ్య గంగమ్మ ఒడికి చేరాడు. శనివారం జిల్లా వ్యాప్తంగా గణేశ్ నిమజ్జన వేడుకలు కన్నుల పండువగా సాగాయి. ఐదు అడుగుల నుంచి 32 అడుగుల వరకు వినాయక ప్రతిమలు ఏర్పాటు చేశారు. శోభాయాత్రలు అట్టహాసంగా సాగగా.. బాజా భజంత్రీలు, డప్పు చప్పుళ్లు, భజనలతో వీధులు మారుమోగాయి. భక్తులు బాణసంచా కాలుస్తూ, రంగులు చల్లుకుంటూ నృత్యాలు చేస్తూ ఆనందోత్సాహాలతో ఊరేగింపుగా ఘాట్‌లకు తరలివెళ్లారు. గణపతి బొప్పా మోరియా అంటూ నినదిస్తూ నిమజ్జన కార్యక్రమాన్ని పూర్తిచేశారు.

15 క్రేనులు, 300 మంది గజ ఈతగాళ్లతో

ఖమ్మం నగరం నలుమూలల నుంచి తరలివచ్చే గణనాథుల నిమజ్జనానికి అధికారులు మున్నేటి వద్ద 15 క్రేన్లు, 300 మంది గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచారు. ఖమ్మం నగరం మున్నేటికి సుమారు 2వేల గణేష్ విగ్రహాలు నిమజ్జనం చేయగా.. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా యంత్రాంగం పటిష్ఠ ఏర్పాట్లు చేసింది. ఇక కాల్వొడ్డులో 12 క్రేనులు, ప్రకాష్‌నగర్‌లో 3 ఏర్పాటు చేసి నిమజ్జన ప్రక్రియను సజావుగా నిర్వహించారు. కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సీపీ సునీల్‌దత్, కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య నిమజ్జన ప్రక్రియ, బందోబస్తును పర్యవేక్షించారు. ఇక ఈ ఏడాది కూడా లడ్డూ వేలం పాటలు ఉత్సాహంగా సాగాయి. సత్తుపల్లిలోని ప్రసన్న గణపతి లడ్డూను మందపాటి కేశవరెడ్డి రూ.4.05లక్షలకు దక్కించుకున్నారు. ఉమ్మడి జిల్లాలో ఇదే అత్యధిక ధర. వాసవి గణపతి లడ్డూను సోమిశెట్టి శ్రీధర్ దంపతులు రూ.1,11,111కు దక్కించుకున్నారు. అలాగే నగరంలోని శ్రీరాంహిల్స్‌లో ఓ భక్తుడు రూ.1.31లక్షలు, జయనగర్‌లో రూ.75వేలు పలికింది. దీంతోపాటు స్వామి వారికి తొమ్మిది రోజులు కట్టిన వస్త్రాలు, హుండీ, కలశం చెంబులు, డబ్బుల దండలను కూడా వేలం నిర్వహించారు.

గోదారమ్మ ఒడికి గణపయ్య

- భద్రాద్రిలో 1,100 విగ్రహాలకు నిమజ్జనం
- నిమజ్జనానికి సిద్ధంగా మరో 500 గణపతులు
- 72 గంటలుగా కొనసాగుతున్న ప్రక్రియ
- పర్యవేక్షించిన ఎస్పీ రోహిత్‌రాజు

7


ఖమ్మం గాంధీచౌక్‌లో డోలు వాయిస్తున్న యువతి


ఖమ్మంలో శోభాయాత్ర ప్రారంభంలో మంత్రి తుమ్మల

ప్రజలు.. సిరి సంపదలతో సుభిక్షంగా ఉండాలి

- గణేష్ శోభాయాత్ర ప్రారంభంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- ఖమ్మం గాంధీచౌక్‌లో సార్వజనిక గణేష్ వీడ్కోలు సభ
- మట్టి గణపతికి పూజ చేసిన మంత్రి

7

నేడు పాక్షిక చంద్రగ్రహణం

భద్రాద్రి రామాలయం మూసివేత

భద్రాచలం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పాక్షిక చంద్రగ్రహణం సందర్భంగా భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయాన్ని ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంట నుంచి మూసివేయనున్నారు. సోమవారం తెల్లవారుజామున మూడు గంటలకు తెరిచి సుప్రభాతం, ఆలయ శుద్ధి, సంప్రోక్షణ, ఆరాధన, సేవాకాలం, నివేదన నిర్వహిస్తారు. అనంతరం ఉదయం 7:30గంటల నుంచి స్వామి వారి దర్శనాలకు భక్తులను అనుమతిస్తారు. కాగా సుప్రభాత దర్శనానికి భక్తులను అనుమతించమని తెలిపారు.


లక్ష్మీతాయారు అమ్మవారు

భద్రాద్రిలో శరన్నవరాత్రి ఉత్సవాలు

- 23 నుంచి అక్టోబరు రెండు వరకు నిర్వహణ
- విజయదశమి రోజున విజయోత్సవం, శమీపూజ, ఆయుధ పూజ
- 7న శబరి స్మృతి యాత్ర
- భద్రాద్రి రామాలయంలో ఆశ్వీయుజ మాసోత్సవాలివే..

7

దేవరపల్లి హైవేను.. శరవేగంగా పూర్తి చేయండి

- కొత్త సంవత్సరంలోపు రాకపోకలు ప్రారంభం కావాలి
- అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశం
- ఖమ్మం ధంసలాపురం వద్ద పనుల పరిశీలన

ఖమ్మం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : నిర్మాణంలో ఉన్న ఖమ్మం-దేవరపల్లి జాతీయ రహదారి పనులను శర వేగంగా పూర్తిచేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత, జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. రాబోయే కొత్త సంవత్సరంలోగా రాకపోకలు ప్రారంభం కావాలని స్పష్టం చేశారు. శనివారం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, నేషనల్ హైవే పీడీ దివ్య, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు ఆర్ అండ్‌బీ ఎస్ఈ యాకోబ్, ఆర్డీవో నరసింహారావు, మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హనుమంతరావుతో కలిసి ఖమ్మం-దేవరపల్లి జాతీయ రహదారి పనులతో పాటు ధంసలాపురం వద్ద ఆర్వోబీ నిర్మాణ పనులను, హైటెన్షన్ విద్యుత్ స్తంభాల మార్పు పనులను మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి.. అధికారులకు పనులు వేగవంతంగా జరిగేందుకు పలు సూచనలు చేశారు. అనంతరం తుమ్మల విలేకరులతో మాట్లాడుతూ.. ఖమ్మం - దేవరపల్లి జాతీయ రహదారి పనులు పూర్తయితే రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఉత్తర, దక్షిణ భారతదేశ ప్రాంతాలకు రవాణా రంగం వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ ప్రాంతాలు రవాణా పరంగా కూడా అనుసంధానం అవుతాయన్నారు. నవంబరు కల్లా ఆర్వోబీ పనులను పూర్తి చేయాలన్నారు. 160కిమీ జాతీయ రహదారి పూర్తి కావడం వల్ల గంటన్నర సమయంలోనే ఖమ్మం నుంచి రాజమండ్రికి వెళ్లే సౌలభ్యం కలుగుతుందన్నారు. రైల్వే ఓవర్‌బ్రిడ్జి డిజైన్ పనులు ఆలస్యం కావడంతో పనుల్లో జాప్యం జరుగుతుందని, నవంబరు చివరికల్లా ధంసలాపురం పనులు పూర్తవుతాయన్నారు అలాగే హైటెన్షన్ విద్యుత్ వైర్లను కూడా తొలగించడం జరుగుతుందన్నారు. భూసేకరణ కూడా అవసరమైన చోట వేగవంతంగా చేయడం జరుగుతుందని తుమ్మల తెలిపారు. కొత్త ఏడాదిలో ఖమ్మం-దేవరపల్లి జాతీయ రహదారి పూర్తిస్థాయిలో ఉపయోగంలోకి వచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని, రైల్వేశాఖను కూడా సమన్వయం చేసుకుని పనులు పూర్తి చేస్తున్నామని తెలిపారు. ఖమ్మం నుంచి సత్తుపల్లి వరకు జాతీయ రహదారికి సర్వీసు రోడ్డు వేస్తే రైతులకు ఉపయోగం ఉంటుందన్నారు. ఇందుకు కావాల్సిన ఏర్పాట్లను కూడా చేపట్టేందుకు అధికారులకు సూచనలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. రూ.3500కోట్లతో ఖమ్మం-దేవరపల్లి జాతీయ రహదారి పనులు నడుస్తున్నాయని మంత్రి తుమ్మల ప్రకటించారు. అలాగే వర్షాలు తగ్గినందున మున్నేరు బ్రిడ్జి పనులు కూడా త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులను తుమ్మల ఆదేశించారు. మంత్రి వెంట ఖమ్మం కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, తహసీల్దార్ సైదులు, ఖమ్మం కార్పొరేటర్లు కమర్తపు మురళి, వీవీపాలెం సొసైటీ అధ్యక్షుడు రావూరి సైదుబాబు, ముదిగొండ సొసైటీ అధ్యక్షుడు తుపాకుల యలగొండ స్వామి, కాంగ్రెస్ నాయకులు సాధు రమేష్‌రెడ్డి ఉన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల


జిల్లా పరిషత్ కార్యాలయంలో ఓటర్ల జాబితాను ప్రదర్శిస్తున్న అధికారులు

పరిషత్ ఓటర్లు.. 8,02,690

- ముసాయిదా జాబితా విడుదల చేసిన అధికారులు
- 8వ తేదీ వరకు అభ్యంతరాల స్వీకరణ
- 10న తుదిజాబితా విడుదల

ఖమ్మం కలెక్టరేట్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లా, మండల పరిషత్ ఎన్నికల నిర్వహణ కోసం అధికార యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు ముసాయిదా ఓటర్ల జాబితాను శనివారం అన్ని మండల కేంద్రాల్లో, జిల్లా పరిషత్ కార్యాలయంలో ప్రదర్శనకు పెట్టారు. జిల్లాలో మొత్తంగా 283 ఎంపీటీసీ స్థానాలున్నాయి. 20 ఎంపీపీలు, 20 జడ్పీటీసీ స్థానాలున్నాయి. వీటి పరిధిలో ఇప్పటి వరకు 1572 పోలింగ్ కేంద్రాలు ఉండగా తాజాగా 8 కొత్త కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 1,589 పోలింగ్ కేంద్రాలతో జాబితాను శనివారం ప్రదర్శనకు పెట్టారు. ఓటర్ల జాబితాలో కూడా 8,02,690 మంది ఓటర్లున్నట్లు లెక్క తేల్చారు. వీటిలో మహిళలు 4,14,425, పురుషులు 3,88,243 మంది థర్డ్‌జెండర్లు 22మంది ఉన్నారు. తాజాగా పంచాయతీల ఓటర్ల జాబితా ఆధారంగా ఈనెల 1 నుంచి ఎంపీటీసీ స్థానాల వారీగా ఓటర్ల జాబితాను మండల పరిషత్ అధికారులు సిద్ధం చేసి శనివారం ప్రదర్శనకు పెట్టారు. వీటిపై ఈనెల 8 వరకు అభ్యంతరాలను స్వీకరించి 10వరకు పరిష్కరించి అదేరోజు తుదిజాబితాను ప్రకటించనున్నారు.


గురుపూజోత్సవాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

తరగతి గదిలో ఉపాధ్యాయుల పాత్రే కీలకం

- విద్యార్థులకు విద్యాప్రమాణాలు అందేలా కృషి చేయాలి
- గురుపూజోత్సవంలో కలెక్టర్ అనుదీప్
- జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం

6

వైరా కేవీకేకు నాలుగు అవార్డులు

- పలు విభాగాల్లో అందించిన సేవలకు గుర్తింపు
- నాలుగు రాష్ట్రాల వార్షిక సమావేశంలో అందుకున్న కో ఆర్డినేటర్

వైరా, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వైరాలోని కృషి విజ్ఞాన కేంద్రాని(కేవీకే)కి ప్రత్యేక గుర్తింపు దక్కింది. వరి విత్తే పద్ధతి, రైతులకు శిక్షణ కార్యక్రమాల నిర్వహణ, డేటా బేస్, యాన్యువల్ రిపోర్టు తయారీ లాంటి నాలుగు విభాగాలకు అవార్డులు దక్కాయి. దక్షిణ భారతదేశంలోని నాలుగు రాష్ట్రాల పరిధి.. అటారీజోన్-10 పరిధిలో ఉన్న ఏపీ, తెలంగాణ, తమిళనాడు, పాండిచ్చేరి రాష్ట్రాల్లోని 72 కృషి విజ్ఞాన కేంద్రాల వార్షిక సమీక్ష సమావేశం తమిళనాడులోని వెల్లూర్ ఐబిటీ క్యాంపస్ అగ్రికల్చర్ యూనివర్సిటీ కోయంబత్తూర్‌లో మూడురోజులపాటు జరిగింది. ఈ సమావేశంలో నాలుగు రాష్ట్రాల్లో ఉన్న కృషి విజ్ఞాన కేంద్రాల 2024-2025లో చేసిన వివిధ కార్యక్రమాలను సమీక్షించారు. నాలుగు రాష్ట్రాల్లో ఉండే ఆయా కృషి విజ్ఞాన కేంద్రాల పనితీరు, రైతులకు అందించిన సేవలకుగాను వివిధ రాష్ట్రాలకు పురస్కారాలు ఇచ్చారు. దానిలో భాగంగానే వైరా కృషి విజ్ఞాన కేంద్రం నాలుగు విభాగాల్లో అందించిన సేవలకుగానూ పురస్కారాలు లభించాయి. నేరుగా వరి విత్తే పద్ధతి, డేటా బేస్, శిక్షణ కార్యక్రమాలు, యాన్యువల్ రిపోర్టు తయారీ లాంటి నాలుగు విభాగాల్లో కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ టి.సుచరిత దేవి పురస్కారాలను అందుకున్నారు. కార్యక్రమంలో జోన్-10 డైరెక్టర్ ఎస్.మీరా, డాక్టర్ రాజ్‌బీర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.


అవార్డు అందుకుంటున్న సుచరిత దేవి

ఉత్సాహంగా ఉద్యోగుల క్రీడా పోటీలు



ఖమ్మంస్పోర్ట్స్,సెప్టెంబరు6(ఆంధ్రజ్యోతి): ఆల్ఇండియా సివిల్ సర్వీసెస్ క్రీడా పోటీలలో పాల్గొనే జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల క్రీడా జట్ల ఎంపికలను శనివారం నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహించారు. ఎంపికలకు ఖమ్మంజిల్లావ్యాప్తంగా 320మంది ఉద్యోగులు పాల్గొన్నారు. ప్రతిభ చూపిన 173 మంది ఉద్యోగులను జిల్లా నుంచి ఎంపిక చేశామని నిర్వాహకులు చెప్పారు. వారు ఈనెల 9,10తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి ఎంపికల్లో పాల్గొంటారని డీవైఎస్‌వో సునిల్‌రెడ్డి తెలిపారు. ఉద్యోగులకు అథ్లెటిక్స్, బాస్కెట్ బాల్, క్రికెట్, చెస్, క్యారమ్స్, హాకీ, ఫుట్ బాల్, కబడ్డీ, లాన్ టెన్నిస్, షటిల్ బ్యాడ్మింటన్, పవర్‌లిఫ్టింగ్, స్విమ్మింగ్, టేబుల్‌టెన్నిస్, వాలీబాల్, వెయిట్‌లిఫ్టింగ్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపిన వారు త్వరలో జరిగే ఆల్‌ఇండియా సివిల్‌సర్వీసెస్ పోటీల్లో రాష్ట్ర జట్టు తరుపున పాల్గొంటారని తెలిపారు.

బాధితుడికి న్యాయం చేసేదెవరు?

- చర్చనీయాంశమైన కిడ్నీ వ్యాధిగ్రస్థుడికి హెచ్‌ఐవీ సోకిన ఘటన
- విచారణ ప్రారంభించిన ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్
- ఆస్పత్రిని సందర్శించి జిల్లా డయాలసిస్ అధికారి

మణుగూరు, సెప్టెంబరు5(ఆంధ్రజ్యోతి): కిడ్నీ వ్యాధిగ్రస్థుడికి హెచ్ఐవీ సోకిన విషయంపై విచారణ ప్రారంభమైంది. అమాయక గిరిజన వృద్ధుడికి జరిగిన అన్యాయాన్ని వివరిస్తూ 'డయాలిస్‌కు వెళితే హెచ్‌ఐవీ' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో శనివారం కథనం ప్రచురితమైంది. దీంతో అతడికి న్యాయం చేసేదెవరు? అసలు అతడికి హెచ్‌ఐవీ ఎలా సోకిందన్నది ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశమైంది. డయాలిస్ కేంద్రాల పర్యవేక్షకులు బి.కిరణ్‌కుమార్ శనివారం మణుగూరు ఆసుపత్రిని సందర్శించారు. క్లినికల్ పొరపాటు ఇందుకు కారణం అయి ఉంటుందని ఆ విభాగానికి చెందిన వైద్యులను విచారణ జరపాల్సి ఉంటుందన్నారు. ఈక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురానికి చెందిన బాధితుడి కుటుంబ సభ్యులు కూడా ఆసుపత్రికి చేరుకుని తమకు జరిగిన అన్యాయాన్ని ఆసుపత్రి సూపరింటెండెంట్ సునీల్‌తో పాటు కిరణ్‌కుమార్‌కు కూడా వివరించారు. పొరపాటు ఎక్కడ ఎలా జరిగిందో తెలపాలని, రోగికి స్థానికంగానే డయాలిసిస్ చేయించేలా అధికారులు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉంటే దీనిపై ఇప్పటికే జిల్లా వైద్య శాఖ అధికారులు విచారణ ప్రారంభించారని ఆస్పత్రి సూపరింటెండెంట్ సునీల్ తెలిపారు. అలాగే హైదరాబాద్ గాంధీ ఆసుపత్రి నెఫ్రాలజిస్టు శ్రీకాంత్‌కు కూడా సమాచారం అందించామని, బాధితులు కోరిన విధంగా డయాలిస్ సెంటర్‌లో ప్రత్యేక ఏర్పాట్ల కోసం ప్రయత్నించగా ఇతర ప్రాంతాల్లో కొత్తగా ఇలాంటి ఏర్పాట్లు చేసేందుకు అనుమతులు లేవని పేర్కొన్నారన్నారు. ఇక సదరు రోగికి హెచ్‌ఐవీ నిర్ధారణ అయిన తర్వాత మొత్తం 34 మంది డయాలిసిస్ రోగులకు రక్త పరీక్షలు నిర్వహించగా 33 మందికి పాజిటివ్ రాలేదని ఇతర రోగులెవరూ అధైర్య పడాల్సిన అవసరం లేదన్నారు. రక్తం ఎక్కించిన తర్వాత జరిగిన డయాలిసిస్ మిషన్ల ద్వారా మరొకరికి ఈ హెచ్‌ఐవీ సంక్రమించే అవకాశం లేదన్నారు.



మాట్లాడుతున్న ఆస్పత్రి సూపరింటెండెంట్ సునీల్, డయాలసిస్ జిల్లా పర్యవేక్షణాధికారి

తదుపరి చికిత్స హైదరాబాద్‌లోనే..

స్థానికంగా ఆ బాధితుడికి డయాలసిస్ చేసే ఏర్పాటు చేయాలని అతడి కుటుంబ సభ్యులు కోరుతున్నా ఇప్పుడున్న పరిస్థితుల్లో అది కష్ట సాధ్యం అవడంతో అతడికి కచ్చితంగా హైదరాబాద్‌లోనే డయాలిసిస్ చికిత్స చేయాల్సి ఉంటుందని స్పష్టమైంది. ఈ క్రమంలో అతడికి అక్కడికి వెళ్లడం వ్యయప్రయాలతో కూడుకున్నది కావడంతో ఖర్చులు భరించే ఆర్థిక స్తోమత వారికి లేకపోవడంతో ఇప్పుడతని పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఈ పరిస్థితిని అటు బాధితుడితో పాటు తమను కూడా మానసికంగా కుంగదీస్తోందని రోగి భార్య, కుమారుడు, కుమార్తె కన్నీటి పర్యంతమవుతున్నారు. తమకు జరిగిన అన్యాయానికి తగిన న్యాయం ఎప్పుడు జరుగుతుందో తెలియడం లేదని, స్థానిక డయాలసిస్ సెంటర్‌లోనే ప్రత్యేకంగా యంత్రాన్ని ఏర్పాటు చేస్తే తమకు కొంత ఉపశమనం ఉంటుందని వారు కోరుతున్నారు. అయితే ప్రస్తుతం అధికారులు విచారణ జరుపుతున్న నేపథ్యంలో ఏ మేరకు చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిన పరిస్థితి. కలెక్టర్ ఈ విషయంపై స్పందించి.. కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని ఆ కుటుంబసభ్యులు డిమాండ్ చేస్తున్నారు.

కర్మాగారానికి పోటెత్తిన పామాయిల్ గెలలు

దమ్మపేట,సెప్టెంబరు6(ఆంధ్రజ్యోతి): అప్పారావుపేట పామాయిల్ కర్మాగారాని శనివారం సాయంత్రానికి ఆయిల్‌పామ్ గెలలు భారీగా చేరాయి. దీంతో పాటు అశ్వారావుపేట కర్మాగారంలో సామర్థ్యానికి మించి గెలల రావటంతో వాటిని కూడా అప్పారావుపేట కర్మాగారానికి తరలించటంతో గెలలు పోటెత్తాయి. ఇప్పటికే 25వందల టన్నులు గెలలు నిల్వ ఉండగా, అదనంగా శనివారం ఒక్క రోజే 1500 టన్నుల గెలలు కర్మాగారానికి వచ్చాయి. ఈవిషయంపై మేనేజర్ కళ్యాణ్‌ను వివరణ కోరగా గెలలు క్రషింగ్‌లో ఎలాంటి ఇబ్బందులు లేదన్నారు. ఆదివారం సాయంత్రం నాటికి క్రషింగ్ చేస్తామన్నారు. గెలలు అన్‌లోడింగ్‌లలో కూడా జాప్యం జరగటం లేదని తెలిపారు.



తరగతి గదుల్లో ఉపాధ్యాయుల పాత్రే కీలకం

- విద్యార్థులకు విద్యా ప్రమాణాలు అందేలా కృషి చేయాలి
- ఖమ్మం కలెక్టర్ అనుదీప్
- ఘనంగా గురుపూజోత్సవం

ఖమ్మంకలెక్టరేట్,సెప్టెంబరు6(ఆంధ్రజ్యోతి): సాంకేతికత ఎంత అందుబాటులో ఉన్నా... తరగతి గదుల్లో ఉపాధ్యాయుల పాత్రే కీలకమని ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. విద్యార్థి జీవితాన్ని పూర్తిగా మార్చే సామర్థ్యం ఒక్క ఉపాధ్యాయుడికే ఉంటుందని ఆయన అన్నారు. ఖమ్మం కలెక్టరేట్‌లో శనివారం గురుపూజోత్సవ కార్యక్రమంలో కలెక్టర్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పి.శ్రీపాల్‌రెడ్డి, అదనపు కలెక్టర్లు పి.శ్రీజ, పి.శ్రీనివాస్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. స్వాగత నృత్యం అనంతరం జ్యోతి ప్రజ్వలన చేశారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా కలెక్టర్ అనుదీప్ మాట్లాడుతూ కరోనా కారణంగా టీచర ప్రాముఖ్యత మనందరికీ మరోసారి తెలిసిందన్నారు. కోవిడ్ సమయంలో పాఠశాలలను మూసి వేసి కంప్యూటర్ ద్వారా బోధన చేశామని,దాని ఫలితంగా పిల్లల విద్యా ప్రమాణాలు సగానికి పైగా పడిపోయాయని అన్నారు. పిల్లలలో పడిపోయిన ప్రమాణాలు పెంచేందుకు అనేక కార్యక్రమాలను విద్యాశాఖ ద్వారా అమలు చేస్తున్నామన్నారు. టీచర్ లేకుండా కేవలం ఆన్‌లైన్ వీడియో ద్వారా పిల్లలకు మంచి విద్య అందించలేమని కలెక్టర్ స్పష్టం చేశారు. తరగతి గదులలో డిజిటల్ క్లాస్ రూమ్ అదనపు సౌకర్యం మాత్రమే నని,టీచర్లు మాత్రమే కేంద్రంగా తరగతి గదులు ఉండాలని కలెక్టర్ అన్నారు. ఎఫ్ఆర్ఎస్ హాజరు నమోదులో రాష్ట్రంలో ఖమ్మం జిల్లా మొదటి స్థానంలో ఉందని, ఇదే స్ఫూర్తితో ఖమ్మం జిల్లావిద్యాశాఖ మరిన్ని మెరుగైన మంచి ఫలితాలు సాధించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పి.శ్రీపాల్‌రెడ్డి మాట్లాడుతూ దశాబ్ద కాలంగా ఉపాధ్యాయులకు పదోన్నతులు లేకుండా చాలా ఇబ్బందులు పడ్డారని, ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఎన్ని ఇబ్బందులు ఉన్నా పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మెరుగ్గా రాణించేలా కృషి చేశారని అన్నారు. నేడు 235 మంది ఉపాధ్యాయులకు అవార్డు అందించడం సంతోషంగా ఉందని, ఈ అవార్డు ఉపాధ్యాయులపై మరింత బాధ్యత పెంచుతుందని అన్నారు. అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి, డీఈవో, అదనపు కలెక్టర్ శ్రీజ మాట్లాడుతూ దేశనిర్మాణం తరగతి గదిలోనే ఉంటుందని అన్నారు. కలెక్టర్, ఎమ్మెల్సీ, మంత్రి, రాష్ట్రపతి పిల్లలైనా ఉపాధ్యాయుల వద్ద విద్యాబుద్ధులు నేర్చుకోవాల్సిందేనని అన్నారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన టీచర్లను ఘనంగా సత్కరించి, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈకార్యక్రమంలో జడ్పీ సీఈఓ దీక్ష రైనా, మండల విద్యాశాఖ అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న కలెక్టర్ అనుదీప్

ఆ 43మంది జేఎంఈటీలను విధుల్లోకి తీసుకుంటాం

సింగరేణి చైర్మన్ బలరాం

రుద్రంపూర్,(సింగరేణి)సెప్టెంబరు6(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థలో తొలగించిన జూనియర్ మైనింగ్ ఇంజనీరింగ్ ట్రెయినీ (జేఎంఈటీ)లుగా చేరిన 43మందిని తిరిగి మళ్లీ సంస్థలోకి తీసుకునేందుకు యాజమాన్యం అంగీకరించింది. ఈ మేరకు సంస్థ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ బలరాం ఈ నిర్ణయం తీసుకున్నారు. శనివారం సింగరేణి యాజమాన్యం ఓ ప్రకటన విడుదల చేసింది. గతంలో వీరు విధులకు సక్రమంగా హాజరు కాకపోవటం, మెడికల్‌లీవుల విషయంలో సరైన ధ్రువపత్రాలు సమర్పించకపోవటంతో వారిని తొలగించారు. రెండు రోజుల క్రితం గుర్తింపు కార్మికసంఘం, చీఫ్‌లేబర్‌కమీషనర్, సింగరేణి యాజమాన్యానికి మధ్య జరిగిన త్రైపాక్షిక సమావేశంలో ఈకీలక నిర్ణయం తీసుకున్నట్లు చైర్మన్ బలరాం ప్రకటించారు. త్వరలోనే నియామక పత్రాలను అందచేస్తామని వివరించారు. ఈ అవకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు పర్ణశాల రామాలయం మూసివేత

దుమ్ముగూడెం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి):పాక్షిక చంద్రగ్రహణం సందర్భంగా ఆదివారం పర్ణశాల రామాలయం మూసివేస్తున్నారు. మధ్యాహ్నం ఒంటిగంట నుంచి పర్ణశాల రామాలయంలో స్వామివారి దర్శనాలను నిలిపివేస్తున్నట్లు ఆలయ ఇన్‌చార్జి అనీల్‌కుమార్ తెలిపారు. సంప్రోక్షణ, శుద్ధి అనంతరం తిరిగి సోమవారం ఉదయం ఏడున్నర గంటల నుంచి భక్తులకు దర్శనాలు పునఃప్రారంభమవుతాయని తెలిపారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



అన్నదానానికి విరాళం అందజేస్తున్న దృశ్యం

భద్రాచలం,సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): కాకినాడకు చెందిన కొచ్చర్ల శ్రీనివాసరావు, చంద్రకళ దంపతులు భద్రాచలం సీతారామ స్వామి వారి అన్నదానం నిమిత్తం రూ.లక్ష విరాళం అందజేశారు.శనివారం ఈ విరాళాన్ని ఆలయ అధికారులకు అందజేశారు. భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి వారికి శనివారం ఆర్జిత సేవలో భాగంగా స్వర్ణ తులసార్చన నిర్వహించారు. అలాగే నిత్యకల్యాణ మండపంలో స్వామి వారి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. విశ్వక్సేనార్చన, పుణ్యహావచనం, కంకణదారణ, జీలకర్రబెల్లం, మాంగల్యదారణ, వేద ఆశీర్వచనాన్ని వైదిక సిబ్బంది నిర్వహించారు.

సింగరేణిలో 46మంది అధికారుల బదిలీ

- ఉత్తర్వులను జారీ చేసిన సింగరేణి యాజమాన్యం

కొత్తగూడెం టౌన్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): సింగరేణిలోని వీఎస్ఎం, పర్చేజ్ విభాగాలకు సంబంధించి 46మంది అధికారులను బదిలీ చేస్తూ సింగరేణి యాజమాన్యం శనివారం రాత్రి ఉత్తర్వులను జారీ చేసింది. కొత్తగూడెం కార్పొరేట్ ఈఅండ్ఎంకు సంబంధించిన అడిషనల్ జీఎం మనోహర్, రామగుండం ఏరియాకు, అడిషనల్ జీఎంగా పనిచేస్తున్న కృష్ణమోహన్‌ను కార్పొరేట్ పర్చేజ్ విభాగానికి, కొత్తగూడెం ఏరియా కిష్టారంలో ఏజీఎంగా పనిచేస్తున్న రామారావును శ్రీరాంపూర్ ఏరియాకు, మందమర్రి సీహెచ్‌పీలో డీజీఎంగా పనిచేస్తున్న బాలాజీ భగవత్‌ను రామకృష్ణాపురానికి, వీటితో పాటు వివిధ హోదాలో పనిచేస్తున్న అధికారులను యాజమాన్యం బదిలీ చేసింది.

వర్షంలోనూ రైతుల ఎదురుచూపులు



యూరియా కోసం వర్షంలో నిలబడిన రైతులు

దుమ్ముగూడెం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి):యూరియా కోసం సొసైటీ కార్యాలయాల ముందు ఉదయం ఆరుగంటలకే రైతులు బారులు తీరుతున్నారు. దుమ్ముగూడెం సొసైటీ కార్యాలయం ముందు శనివారం వర్షంలోనూ రైతులు క్యూలైన్లో నిలబడ్డారు. రైతులు అవకాశం ఉన్నంత వరకు ఇంట్లోని వారందరినీ యూరియా కోసం క్యూలైన్లో నిలబడుతున్నారు. కొందరు రైతులు ముందు జాగ్రత్తగా మున్ముందు సాగుచేయబోయే మెరక పంటల కోసం యూరియాను స్టాకు పెడుతుండగా, వరి సాగుకు అత్యవసరమైన రైతులు నిరాశగా ఇంటి ముఖం పడుతున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య



సాయికిరణ్(ఫైల్)

కూసుమంచి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌటపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు నూకల మల్లయ్య కుమారుడు నూకల సాయి కిరణ్(23) ఆర్థిక ఇబ్బందులతో బలవన్మరణానికి పాల్పడ్డాడు. సాయి కిరణ్ కూసుమంచిలో గత కొంతకాలంగా కిరాణం దుకాణం నడుపుతున్నాడు. ఈక్రమంలో వ్యాపారంలో పెట్టుబడుల నిమిత్తం కొంత అప్పు లు చేశాడు. ఈక్రమంలో చేసిన అప్పులు భారంగా మారడంతో శుక్రవారం ఉదయం పురుగుమందు సేవించాడు. తల్లిదండ్రులకు మొబైల్‌లో మెసెజ్ చేసి అక్కడకు చేరుకోవడంతో అప్పటికే అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. వెంటనే ఉన్నతవైద్యం నిమిత్తం ఖమ్మం ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందు తూ శనివారం ఉదయం మృతి చెందాడు. మృతుడి తండ్రి మల్లయ్య ఫిర్యాదుమేరకు పోలీసులు మృతదేహాన్ని పంచానామా నిమిత్తం నేలకొండపల్లి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఏడాది వయస్సున్న కుమారుడు ఉన్నారు. ఈనెల 10న కుమారుడి మొదటి పుట్టినరోజు ఉంది. భార్య ప్రస్తుతం ఆరునెలల గర్భవతి. సాయికిరణ్ మృతితో గ్రామంలో విషాదం అలుముకుంది.

సాయికిరణ్ మృతిపట్ల బీఆర్ఎస్ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. తండ్రి నూకల మల్లయ్యను పరామర్శించారు. మండల అధ్యక్షులు వేముల వీరయ్య, కార్యదర్శి ఆసీఫ్ పాషా, నాయకులు మల్లీడు వెంకన్న, దాసరి వెంకన్న, బాలకృష్ణ, నలగాటి నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి కాంట్రాక్టర్ బలవన్మరణం



శ్రీనివాసరావు(ఫైల్)

కారేపల్లి / ఇల్లెందు టౌన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కారేపల్లి మండలం మొట్లగూడెం గ్రామానికి చెండిన గడిపర్తి శ్రీనివాసరావు (50) శుక్రవారం అర్ధరాత్రి తన పంటచేను వద్ద పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన జరిగింది. కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. శ్రీనివాసరావుకు బావ వరసైన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మాజీ మునిసిపల్ చైర్‌పర్సన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావుకు గడిపర్తి శ్రీనివాసరావుకు మధ్య ఆర్థికపరమైన లావాదేవీలున్నాయి. ఈక్రమంలో శుక్రవారం ఇరువర్గాల పెద్దమనుషుల నడుమ మాట్లాడుకున్నారు. తర్వాత శ్రీనివాసరావు ఇంటికి వచ్చే క్రమంలో మొట్లగూడెంలోనే తన పంట చేను వద్దకు కారులో వెళ్లిన ఆయన పురుగుల మందు తాగి మృతిచెందాడు. తెల్లవారి ఆ ప్రాంతానికి వెళ్లిన గ్రా మస్థులు గమనించి స్థానికులకు సమాచారం అందించారు. మృతుడి భార్య రమ ఫిర్యాదు మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పంచనామ నిర్వహించారు. అనంతరం భౌతికకాయాన్ని పోస్టుమార్టం కోసం ఇల్లెందు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

మాజీ మునిసిపల్ చైర్మన్ ఇంటి ఎదుట ధర్నా

కాంట్రాక్టర్ గడిపర్తి శ్రీనివాసరావు ఆత్మహత్యకు సంబంధించి ఇల్లెందు మాజీ మునిసిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరావు కారణమంటూ మృతుడి కుటుంబ సభ్యులు శనివారం ఆందోళన నిర్వహించారు. మాజీ మునిసిపల్ చైర్మన్ ఇంటి ఎదుట మృతదేహంతో ధర్నా నిర్వహించారు. అనంతరం కోపోద్రిక్తులైన మృతుని కుటుంబ సభ్యులు వెంకటేశ్వరావు కారు అద్దాలతో పాటు, ఇంటి కిటికీ అద్దాలను ధ్వంసం చేశారు. ఈ ఆందోళన సమాచారం అందుకున్న ఇల్లందు డీఎస్పీ చంద్రబాబు, సీఐ సురేష్ తమ సిబ్బందితో వచ్చి ఆందోళనకారులకు సర్దిచెప్పారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబ సభ్యులు మాట్లాడుతూ వెంకటేశ్వరావుతో ఉన్న ఆర్థిక లావాదేవీల్లో వచ్చిన ఇబ్బందుల కారణంగానే శ్రీనివాస్‌రావు ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఆరోపించారు. కాగా ఆత్మహత్యకు పాల్పడిన శ్రీనివాస్‌రావు మృతదేహన్ని ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాల మార్చురీలో ఉంచగా ఎమ్మెల్యే కోరం కనకయ్య సందర్శించి నివాళ్లు అర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు.

అక్రమంగా ఇసుక, మట్టి రవాణా

- ఆరు ట్రాక్టర్లను పట్టుకున్న తహసీల్దార్
- కార్యాలయానికి తరలిస్తుండగా అధికారుల కన్నుగప్పి ట్రాక్టర్లతో పరార్
- పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్న అధికారులు

అశ్వారావుపేట రూరల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా ఇసుక, మట్టి ట్రాక్టర్లను రెవిన్యూ అధికారులు పట్టుకోగా, పట్టుబడిన ట్రాక్టర్లను రెవిన్యూ కార్యాలయానికి తరలిస్తుండగా అధికారుల కళ్లుగప్పి ట్రాక్టర్లు పరారయ్యారైన ఘటన అశ్వారావుపేట మండలంలో శనివారం జరిగింది. వివరాల్లోకి వెళితే మండలంలోని వినాయకపురం, జగన్నాధపురం, ఊట్లపల్లి ప్రాంతాల్లో అక్రమంగా ఇసుక, మట్టిని తరలిస్తున్నారనే సమాచారంలో తహసీల్దారు రామకృష్ణ వినాయకపురం, అశ్వారావుపేట మధ్యలో తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో 8ట్రాక్టర్లు పట్టుబడగా రెండు ఇసుక ట్రాక్టర్లకు అనుమతులు ఉన్నాయి. మిగిలిన 6 ట్రాక్టర్లును రెవిన్యూ కార్యాలయానికి తరలించి సీజ్ చేయాలని సిబ్బందికి సూచించారు.

ఈనేపథ్యంలో అశ్వారావుపేటకు బయలుదేరిన ఆరు ట్రాక్టర్లను డ్రైవర్లు సిబ్బంది కళ్లుగప్పి పారిపోయారు. ట్రాక్టర్లు ఎంతకీ కార్యాలయానికి రాకపోవటంతో విచారించగా పారిపోయినట్లుగా గుర్తించారు. దీనిపై తహసీల్దారు రామకృష్ణ మాట్లాడుతూ ఆరు ట్రాక్టర్లను సీజ్ చేసేందుకు కార్యాలయానికి పంపానని, కానీ మార్గమధ్యలో ట్రాక్టర్లు పారిపోయినట్లు సిబ్బంది తెలిపారని అన్నారు. పట్టుకున్న ఆరు ట్రాక్టర్ల వివరాలను సేకరించి పోలీసులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.



ట్రాక్టర్లను తనిఖీ చేస్తున్న తహసీల్దార్ రామకృష్ణ

భద్రాద్రి జిల్లాలో ఏఈవోల నిరసన

కొత్తగూడెం అర్బన్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లాలోని డోంగ్లీలో ఏఈవోగా విధులు నిర్వర్తిస్తున్న బస్వారాజ్ (30)కి ఉన్నతాధికారుల ఒత్తిడి కారణంగా గుండెపోటు వచ్చిందని భద్రాద్రికొత్తగూడెం ఏఈవో సంఘం నాయకులు ఆరోపించారు. శనివారం ఐడీఓసీ కార్యాలయం వద్ద బస్వారాజ్ మృతి పట్ల సంతాపం తెలిపి నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏఈవోలకు పంటల నష్టం వివరాలు, పంటలు సాగుచేస్తున్న క్రాప్ వివరాలు, యూరియా పంపిణీ బాధ్యతలు కేటాయించిందని, జిల్లాలో వ్యవసాయ క్లస్టర్లకు సరిపడా ఏఈవోల నియామకం లేకపోవడంతో క్లస్టర్ల పరిధిలోని భూములు సూదూర ప్రాంతంలో ఉన్నాయని, రెవెన్యూ హద్దులకు, ఫీల్డ్ విజిట్‌లో భూములకు పొంతనలేకపోవడం... అన్ని వివరాలు పూర్తిచేసి నివేదికలు సమర్పించాలని ఒత్తిడి చేసి పనిభారం పెంచుతుందని ఆరోపణలు చేశారు. ప్రభుత్వం చిరు ఉద్యోగులపై పని ఒత్తిడి పెంచవద్దని కోరారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఏఈవోలపై పని ఒత్తిడి తగ్గించాలని, పలు సమస్యలపై డీఏవో బాబురావుకు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బి. నర్సింహారావు, సందీప్, షకీరాబాను, రవీందర్‌రావు, గౌస్, ప్రసాద్, రమేష్, చరణ్, ప్రశాంత్, గోపికృష్ణ, పవన్, రజినికాంత్, సూరిబాబు, ప్రవీణ్, రమేష్‌బాబు, యశ్వంత్, సుమన్, సతీష్, తదితరులున్నారు.



డీఏవోకి వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

సత్తుపల్లిరూరల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన సంఘటన సత్తుపల్లి మండలం చంద్రాయపాలెంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం తొట్టివంపునకు చెందిన కొర్సా వెంకటేశ్వర్లు కుమారుడు నవీన్(29) ద్విచక్ర వాహనంపై వస్తూ ప్రమాదవశాత్తూ రోడ్డు ప్రమాదానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ పరామర్శించారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పట్టణ సీఐ టీ.శ్రీహరి తెలిపారు.

చెట్టుపై నుంచి పడి ఒకరు...

తిరుమలాయపాలెం, సెప్టెంబరు6(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు యువకుడు మృతిచెందిన ఘటన శనివారం మండలంలో జరిగింది. ఇస్లావత్‌తండాకు చెందిన ఇస్లావత్ సక్కులాల్(25) మేకలకాపరిగా పనిచేస్తున్నాడు. ఈనేపథ్యంలో శనివారం ఉదయం మేకలతోలుకుని గ్రామసమీపంలోకి వెళ్లాడు. ఈక్రమంలో మేకలకు చెట్టుకున్న కొమ్ములు కొట్టేందుకు చెట్టుపై ఎక్కాడు. కొమ్ములు కొడుతండగా ప్రమాదవశాత్తుజారి చెట్టుకింద ఉన్న విద్యుత్‌లైన్లపై పడ్డాడు. అనంతరం కిందనే ఉన్న వ్యవసాయ బావిలో పడి మృతి చెందాడు. మృతునికి ఈతకూడా రాదు. మృతునికి ఏడాది క్రితం వివాహం అయింది. ఈమేరకు మృతుని బంధువులు స్థానికి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

మృతదేహం లభ్యం

ముదిగొండ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వినాయక నిమజ్జనం సందర్భంగా మండలంలోని మాధాపురం చెరువులో ప్రమాదవశాత్తూ చెరువులో జారిపడి గల్లంతైన యువకుడి మృతదేహం శనివారం లభ్యమైంది. గ్రామానికి చెందిన పడిశాల సైదారావు(23) శుక్రవారం సాయంత్రం వినాయక ఊరేగింపులో పాల్గొన్నాడు. ఆతర్వాత చెరువులో వినాయక విగ్రహ నిమజ్జనం అనంతరం చెరువులో స్నానం చేస్తూ జారిపడి గల్లంతయ్యాడు. శుక్రవారం రాత్రి వరకు గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ ఆచూకీ లభించలేదు. శనివారం పోలీసులు గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టగా సైదారావు మృతదేహాన్ని బయటకు తీశారు. ఈ సంఘటనపై ముదిగొండ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. సైదారావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య

చుంచుపల్లి, సెప్టెంబరు6(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో రుద్రంపూర్‌లో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కొత్తగూడెం టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రుద్రంపూర్ పంచాయతీలోని ఎర్రగడ్డలో దొంతరబోయిన కామేశ్వరరావు(36), భార్య లావణ్యతో కలిసి జీవిస్తున్నారు. మహారాష్ట్రలోని చంద్రాపూర్ ప్రాంతంలో ఓ ప్రైవేట్ కంపెనీలో స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా పని చేస్తున్నాడు. కాగా శనివారం ఉదయం భార్య, భర్త మధ్య ఘర్షణ చోటు చేసుకోవడంతో అతను బయటికి వెళ్లాడు. తిరిగి ఇంటికి వచ్చి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో టూటౌన్ ఎస్ఐ కిషోర్ సంఘటనా స్థలాన్ని సందర్శించి వివరాలు సేకరించారు. మృతుడికి ఒక కుమార్తె ఉంది. మృతుడి సోదరుడు రాజకుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

అశ్వారావుపేట, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి) : అశ్వారావుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులకు తాత్కాలిక ప్రాతిపదికన నియామకాలు చేపడుతున్నట్లు ప్రిన్స్‌పాల్ గోపి తెలిపారు. కళాశాలలో పొలిటికల్ సైన్సు, కామర్స్, ఎకానమిక్స్, హిస్టరీ, కెమిస్ట్రీ, బోటని విభాగాలలో ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. ఈనెల 9లోపు దరఖాస్తులను సత్తుపల్లి ప్రభుత్వ జేవీఆర్ డిగ్రీ కళాశాలలో అందజేయాలని కోరారు. 11న కొత్తగూడెంలోని శ్రీరామచంద్ర ఆర్ట్స్ అండ్ సైన్సు కళాశాలలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



ఖమ్మం బ్యాంకు కాలనీలో చిన్నారుల ఉత్సాహం



భద్రాచలం వద్ద గోదావరికి వచ్చిన వినాయక ప్రతిమలు

నవరాత్రులు ముగిశాయి. ఘనంగా పూజలందుకున్న ఆ బొజ్జ గణపయ్య గంగమ్మ ఒడికి చేరాడు. శనివారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గణేశ్ నిమజ్జన వేడుకలు కన్నుల పండువగా జరిగాయి. శోభాయాత్రలు అట్టహాసంగా సాగగా.. బాజా భజంత్రీలు, డప్పు చప్పుళ్లు, భజనలతో వీధులు మారుమోగాయి. భక్తులు బాణసంచా కాలుస్తూ, రంగులు చల్లుకుంటూ నృత్యాలు చేస్తూ ఆనందోత్సాహాలతో గణపతి బొప్పా మోరియా అంటూ నిమజ్జన కార్యక్రమాన్ని పూర్తిచేశారు.

గోదారమ్మ ఒడిలోకి గణపయ్య



కొత్తగూడెంలో.. శోభాయాత్రలో యువత..



ఖమ్మంలో యువత సందడి



ఖమ్మం నగరంలో..



ఖమ్మం రాజీవ్ గృహకల్ప సమీపంలో..

భద్రాద్రిలో 1100 విగ్రహాలకు నిమజ్జనం
72 గంటలుగా కొనసాగుతున్న ప్రక్రియ
పర్యవేక్షించిన ఎస్పీ రోహిత్‌రాజు

భద్రాచలం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : భక్తులతో తొమ్మిది రోజుల పాటు పూజలందుకున్న గణపయ్య గోదారమ్మ ఒడిలోకి చేరాడు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి గణనాధులు భద్రాచలంలోని పవిత్ర గోదావరిలో నిమజ్జనం చేసేందుకు స్థానిక నిమజ్జన ఘాట్‌కు తరలొస్తున్నాయి. గత 72 గంటలుగా గోదావరిలో గణేష్ విగ్రహాలను సిబ్బంది నిమజ్జనం చేస్తూనే ఉన్నారు. ఇప్పటి వరకు అధికారిక లెక్కల ప్రకారం 1100 విగ్రహాలను నిమజ్జనం చేశారు. మరో 500 విగ్రహాలకు పైనే ఆదివారం ఉదయానికి చేరుకోనుండగా.. వాటిని నిమజ్జనం చేసేందుకు సిబ్బంది సిద్ధంగా ఉన్నారు.

ఇందుకోసం ఐదు క్రేన్లు, బ్లేడు ట్రాక్టర్లు రెండు, జేసీబీలు ఐదు, గజ ఈతగాళ్లు 20 మంది, విగ్రహాలు మోసేవారు 30 మంది వరకు విధుల్లో నిమగ్నమయ్యారు. ఇదే సమయంలో వైద్య శాఖ ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేసింది. అలాగే తెలంగాణ అగ్నిమాపక శాఖ రెస్క్యూ బృందాలు ఆపద సమయంలో ఆదుకునేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఇదిలా ఉండగా.. భద్రాచలం పట్టణంలోని వివిధ గణేష్ విగ్రహాలను ఆనందోత్సాహాల మధ్య భక్తులు నిమజ్జనానికి తీసుకొచ్చారు. ఈ సమయంలో నృత్యాలు, డప్పు వాయిద్యాలు నడుమ శోభాయాత్ర సాగింది.





గోదావరి తీరంలో సందడి..

నిమజ్జన ప్రదేశాన్ని పరిశీలించిన భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజు

భద్రాచలం వద్ద గోదావరి నదీతీరంలో ఏర్పాటుచేసిన నిమజ్జన ఘాట్‌ను జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు శనివారం పరిశీలించారు. నిమజ్జనం కోసం తరలివచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పటిష్ఠమైన ఏర్పాట్లు చేశామని ఎస్పీ తెలిపారు. ఈ సమయంలో స్థానిక అధికారులకు పలు సూచనలు చేశారు. నిమజ్జన సమయంలో ఉత్సవ కమిటీ సభ్యులు పోలీసుల సూచనలను పాటించాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో గణేష్ నిమజ్జన ఊరేగింపు కార్యక్రమాలు పూర్తి చేయనున్నామన్నారు. నిమజ్జనం సందర్భంగా డీజేలు, బాణసంచా కాల్చడం నిషేధమని ఎస్పీ స్పష్టం చేశారు. చట్టానికి విరుద్ధంగా ప్రవర్తించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిమజ్జన కార్యక్రమాన్ని మత సామరస్యంతో శాంతియుత వాతావరణంలో జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్పీ కోరారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్‌కుమార్‌సింగ్, సీఐ నాగరాజు ఇతర అధికారులు పాల్గొన్నారు.



భద్రాచలంలో నిమజ్జనంపై అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ రోహిత్‌రాజు



ఖమ్మంలో మున్నేరు వద్ద నిమజ్జన ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ అనుదీప్, సీపీ సునీల్‌దత్, కమిషనర్ అగస్త్య



ఖమ్మంలో బుజ్జిగణపయ్యను నిమజ్జనానికి తరలిస్తున్న చిన్నారులు



భద్రాచలంలో క్రేన్ల సహాయంతో తరలిస్తున్న దృశ్యం



భద్రాచలం వద్ద గోదావరిలో..







ఖమ్మం వద్ద మున్నేరులో నిమజ్జనమవుతున్న గణపయ్య ప్రతిమలు



గణపతి ప్రతిమను నిమజ్జనానికి తీసుకొచ్చిన యువతి



ఖమ్మం మున్నేటి ఒడ్డున కోలాహలం



ఆంధ్రజ్యోతి ఖమ్మం యూనిట్ కార్యాలయంలో పచ్చని చెట్ల మధ్య సహస్రధారతో మట్టిగణపయ్యకు నిమజ్జనం నిర్వహిస్తున్న దృశ్యం



కూసుమంచి చెరువు వద్ద..




వైరాలో శోభాయాత్ర..



ఖమ్మం విజయనగర్ కాలనీలో జరిగిన శోభాయాత్రలో మహిళల కోలాటం



ఖమ్మంలో శోభాయాత్రలో పౌరాణిక పాత్రధారుల సందడి



గణపయ్య హస్తంలో ఒదిగిన చంద్రబింబం.. ఖమ్మం మున్నేటి వద్ద కనిపించిందీ దృశ్యం

ప్రజలు.. సిరి సంపదలతో సుభిక్షంగా ఉండాలి

గణేష్ శోభాయాత్ర ప్రారంభంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
ఖమ్మం గాంధీచౌక్‌లో సార్వజనిక గణేష్ వీడ్కోలు సభ
మట్టి గణపతికి పూజ చేసిన మంత్రి తుమ్మల



ఖమ్మం గాంధీచౌక్‌లో శోభాయాత్రను ప్రారంభించి మాట్లాడుతున్న మంత్రి తుమ్మల, వేదికపై మేయర్ నీరజ, కలెక్టర్ అనుదీప్, ఎస్పీ సునీల్‌దత్, కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, ఉత్సవ సమితి సభ్యులు

ఖమ్మంఖానాపురంహవేలి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు సిరి సంపదలు, పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని, ఆ గణపయ్య దీవెనలతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధితో అగ్రగామిగా నిలవాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం ఖమ్మం గాంధీచౌక్‌లో స్తంభాద్రి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సార్వజనిక గణేష్ వీడ్కోలు సభకు, గణేష్ శోభాయాత్ర ప్రారంభానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ నవరాత్రులు పూజలు అందుకున్న ఆ బొజ్జ గణపయ్య గంగ ఒడికి చేరే కార్యక్రమానికి కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, మేయర్ నీరజ, మునిసిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, పోలీస్ కమిషనర్ సునిల్ దత్ ఆధ్వర్యంలో పటిష్ఠ ఏర్పాట్లు చేశారన్నారు. పోలీస్‌వారు సూచించిన మార్గాల్లోనే శోభాయాత్రగా వెళ్లి నిమజ్జనం పూర్తి చేసుకొని సంతోషంగా, క్షేమంగా ఇళ్లకు చేరుకోవాలన్నారు. ఖైరాతాబాద్ గణేష్ మహారాజ్ నిమజ్జనం అనంతరం ఖమ్మంలో శోభాయాత్ర ప్రారంభమవడం ఎంతో సంతోషమన్నారు. ఖమ్మం జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలనే లక్ష్యంతోనే ఏ మాత్రం వెనుకడుగేయకుండా అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామన్నారు. గతంలో అధికార యంత్రాంగ అలసత్వంతో పాలన గాడితప్పిందని, ప్రస్తుత కలెక్టర్ ఆధ్వర్యంలో అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తూ జిల్లాను రాష్ట్రానికే తలమానికంగా నిలపాలని ఆకాంక్షించారు.పూర్వ కలెక్టర్లు వీవీఆర్‌కే ప్రసాద్, గిరిధర్ లాంటివారు జిల్లా అభివృద్ధిలో ప్రజల గుండెల్లో ఉంటారని, ప్రస్తుత కలెక్టర్ కూడా అలాంటి గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. గతేడాది వరదలు వచ్చిన సమయంలో ప్రజలు ఇబ్బందులు పడ్డారని, ఎంతో ఆస్తిని కోల్పోయారని ఇది ఎంతో బాధాకరమన్నారు. కానీ నాడు కొత్తగా వచ్చిన మునిసిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఎంతో కష్టపడి అధికారుల సహాయంతో వరద బాధితులకు సహాయ సహకారాలు అందించి ప్రాణ నష్టం జరగకుండా చూశారన్నారు. ఖిల్లా రోప్‌వే, కేబుల్ బ్రిడ్జ్, రిటైనింగ్ వాల్ తదితర అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోకి తీసుకొచ్చేందుకు వారు కష్ట పడుతున్నారన్నారు. అనంతరం బ్రాహ్మణబజార్ నుంచి ప్రత్యేక పల్లకీలో తెచ్చిన మట్టి గణనాథుడికి పూజ నిర్వహించిన మంత్రి తుమ్మల శోభాయాత్రను ప్రారంభించారు. అంతకుముందు మేయర్, పోలీస్ కమిషనర్, కలెక్టర్ మాట్లాడుతూ మంత్రి తుమ్మల సూచనలతో గత అనుభవాలను దృష్టిలోపెట్టుకుని నిమజ్జన కార్యక్రమాలకు పటిష్ఠ ఏర్పాట్లు చేశామన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో నరసింహారావు, కాంగ్రెస్ నాయకులు సాధు రమేష్‌రెడ్డి, యలగొండస్వామి, కార్పొరేటర్ కమర్తపు మురళి, యర్రం బాలగంగాధర్ తిలక్, ఉత్సవ సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వినోద్ లాహోటి, కీసర జయపాల్‌రెడ్డి, కన్వీనర్ కన్నం ప్రసన్న కృష్ణ, సభ్యులు పాల్గొన్నారు.

భద్రాద్రిలో శరన్నవరాత్రి ఉత్సవాలు

23 నుంచి అక్టోబరు రెండు వరకు నిర్వహణ
విజయదశమి రోజున విజయోత్సవం, శమీ, ఆయుధ పూజ
7న శబరి స్మృతి యాత్ర
భద్రాద్రి రామాలయంలో ఆశ్వీయుజ మాసోత్సవాలివే..



భద్రాచలం, సెప్టెంబరు6 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో శరన్నవరాత్రి ఉత్సవాలను నిర్వహించనున్నారు. ఈ నెల 23 నుంచి అక్టోబరు రెండు వరకు ఈ ఉత్సవాలను జరపనున్నారు. 2వ తేదీన విజయదశమి సందర్భంగా సంక్షేప రామాయణ హ వన పూర్ణాహుతి, నిజరూప లక్ష్మి అలంకారంలో అమ్మవారు దర్శనమివ్వ నున్నారు. అలాగే మహా పట్టాభిషేకం, సాయంత్రం విజయోత్సవం, శమీ పూజ, ఆయుధ పూజ, శ్రీరామ లీలా మహోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఆశ్వీయుజ మాసంలో జరపాల్సిన ఉత్సవాల వివరాలను దేవస్థానం ఈవో కె.దామోదర్‌రావుకు స్థానాచార్యులు కేఈ స్థలశాయి అందజేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను భద్రాద్రి దేవస్థానం అధికారులు మీడియాకు శనివారం విడుదల చేశారు.

23న ఆదిలక్ష్మి అలంకారంతో శ్రీకారం

ఈ నెల 23వ తేదీన ఆదిలక్ష్మి అలంకారంతో శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. తొలి రోజున బాలకాండతో శ్రీరామాయణ పారాయణం ప్రారంభమవుతుంది. 24న సంతాన లక్ష్మి అలంకారం, అయోధ్యకాండ, 25న గజలక్ష్మి అలంకారం రోజున అయోధ్య కాండ పారాయణం చేయనున్నారు. 26న ధనలక్ష్మి అలంకారం నాడు అరణ్యకాండ, 27న ధాన్యలక్ష్మి అలంకారం రోజున కిష్కింద కాండ పారాయణం చేయనున్నారు. అలాగే 28న విజయలక్ష్మి అలంకారం రోజున సుందరకాండ, 29న ఐశ్వర్యలక్ష్మి అలంకారం నాడు యుద్ధకాండ, 30న వీరలక్ష్మి అలంకారం నాడు యుద్ధకాండ, అక్టోబరు ఒకటిన మహాలక్ష్మి అలంకారం రోజున యుద్ధకాండ పారాయణం నిర్వహించనున్నారు. ఇదిలా ఉండగా.. 23 నుంచి అక్టోబ రు 2 వరకు ప్రతీరోజు తిరవీధి సేవలు నిర్వహిస్తారు. 24 నుంచి రెండో తేదీ వరకు ప్రతీరోజూ ఉదయం సంక్షేప రామాయణ హవనం జరుగుతుంది. శరన్నవరాత్రి ఉత్సవాల కారణంగా 26న శుక్రవారం సంధ్యాహారతి జరపబడదు.

అక్టోబరు ఏడున శబరి స్మృతి యాత్ర

అక్టోబరు ఏడున పూర్ణిమను పురస్కరించుకొని భద్రాద్రి దేవస్థానం ఆధ్వర్యంలో శబరి స్మృతి యాత్రను నిర్వహించ నున్నారు. అలాగే శ్రీవాల్మీకి జయంతిని సైతం నిర్వహిం చనున్నారు. అక్టోబరు 20న నరక చతుర్థశి సందర్భంగా తెల్లవారుజామున 3.30 గంటలకు సుప్రభాతం, 4 గంటల కు మంగళ హారతి, ఐదు గంటలకు మంగళ స్నానం, (మూలమూర్తులకు అభిషేకం) నిర్వహించనున్నారు.



వినాయక సెలవిక

» ప్రశాంతంగా గణేష్ నిమజ్జనం, ముగిసిన నవరాత్రి వేడుకలు
» నిమజ్జనఘాట్లను సందర్శించిన కలెక్టర్, సీపీ, కమిషనర్





నగరంలో నిమజ్జనానికి తీసుకు వెళుతున్న గణనాథుడు



పెదతండాలో..



ఒకటో డివిజన్ రైల్వే కాలనీలో..



హరివిల్లు అపార్టుమెంటులో..



తిరుమలాయపాలెంలో



నేలకొండపల్లిలో..

ఖమ్మంఖానాపురంహవేలి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గణేశ్ నిమజ్జన వేడుకలు కన్నుల పండువగా సాగాయి. తొమ్మిది రోజులుగా మండపాల్లో పూజలు అందుకున్న వినాయకుడు శనివారం నిమజ్జనానికి తరలి వెళ్లారు. ఉత్సవాల్లో యువత, పిల్లలు ఉత్సాహంగా, ఉల్లాసంగా పాల్గొన్నారు. ఈ ఏడాది ఐదు అడుగుల నుంచి 32 అడుగుల వరకు వినాయక ప్రతిమలు ఏర్పాటు చేశారు. వివిధ వేషధారణలు ధరించి భక్తులను ఆకట్టుకున్నారు.

డప్పు వాయిద్యాలు, భజనలతో మార్మోగిన వీధులు

నగరం మున్నేరు తోపాటు వివిధ మండలాలలోని గ్రామాలలో, పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ నిమజ్జన ప్రక్రియ వైభవంగా సాగింది. గణపతి బప్పా మోరియా అంటూ పుర వీధులు మార్మోగాయి. డీజేలు, బ్యాండు మేళాలు, డప్పు చప్పుళ్ల హోరెత్తాయి. అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసు సిబ్బందిని భారీగా మోహరించారు. సీపీ సునిల్ దత్ స్వయంగా బందోబస్తును పర్యవేక్షించారు.

ఖమ్మం ఆంధ్రజ్యోతి యూనిట్ కార్యాలయంలో..

వినాయక చవితి సందర్భంగా ఖమ్మం నగరంలోని ఆంధ్రజ్యోతి యూనిట్ కార్యాలయంలో 5 అడుగుల మట్టి గణనాథుడిని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం ఖమ్మం ఆంధ్రజ్యోతి యూనిట్ కార్యాలంలోని మట్టి గణపయ్యను కార్యాలయంలోని మామిడి చెట్లలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన నీళ్లతో శోభాయమానంగా నిమజ్జనం చేశారు. ముందుగా గణపయ్యకు ప్రత్యేకం పూజలు చేశారు.చివరిరోజు పూజా కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ తాళ్ళూరి. పుల్లారావు,నాగలక్ష్మీ దంపతులు, బ్యూరో ఇన్‌చార్జ్ వెంకటరావు, ఎడిషన్ ఇంచార్జ్ కొల్లు రాజేష్, యాడ్ మేనేజర్ మానప్రగడ రమేష్, సర్క్యులేషన్ మేనేజర్ మొగలపు సూర్యనారాయణ, గోగినేని, శిరీష, ప్రొడక్షన్ ఇంచార్జి కర్నాటి. సురేష్, సబ్ ఎడిటర్లు, కార్యాలయ సిబ్బంది, నగర జర్నలిస్టులు పాల్గొని గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి లడ్డు, వస్త్రాలు, కలశం,హుండి వేలం నిర్వహించారు.

ఖమ్మంక్రైం: కట్టుదిట్టమైన పోలీసు భద్రత మధ్య ప్రశాంతంగా గణేష్ నిమజ్జన వేడుకలు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టిన ముందస్తు పోలీసు అధికారులు 500మంది పోలీసు సిబ్బందితో బందోబస్తును ఏర్పాటుచేశారు. నగరంలో కొన్ని ప్రాంతాల్లో ఉన్న భారీ గణపతి విగ్రహాలకు, నిమజ్జనానికి, ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగకుండ అప్పటికప్పుడు రద్దీని క్లియర్ చేస్తూ ప్రశాంతంగా నిమజ్జనం జరిగేలా చర్యలు చేపట్టారు. నగరంలోని మున్నేరు నిమజ్జన ఘాట్‌ను కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, పోలీసు కమిషనర్ సునిల్‌దత్, కార్పొరేషన్ కమినర్ అభిషేక్ అగస్త్య సందర్శించారు.



నేలకొండపల్లిలో నిమజ్జనానికి తరలిస్తున్న వినాయకుడు

వాహన డ్రైవర్లకు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

నిమజ్జన వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ముందుగా చెప్పిన విధంగా నగరంలో పలు ప్రాంతల్లో పోలీసులు డ్రంక్ అండ్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. కాల్వొడ్డు సమీపంలో నిమజ్జనంకు వచ్చే వాహనాల డ్రైవర్లకు డ్రంక్ అండ్‌డ్రైవ్ తనిఖీ నిర్వహించిన అనంతరం వాహనాలను నిమజ్జన ఘాట్‌లోకి అనుమతించారు. ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో సీఐ బెల్లం సత్యనారాయణ, ఎస్ఐ సాగర్, ఇతర సిబ్బంది తనిఖీ పాయింట్లు ఏర్పాటు చేశారు.

ఖమ్మంరూరల్:రూరల్ మండలం, ఏదులాపురం మునిసిపాలిటీలో శనివారం వినాయక నిమజ్జనం వేడుక ప్రశాంతగా జరిగింది. మండలంలో మొత్తం 189 వినాయక విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఏదులాపురం మున్సిపాలిటిలో మొత్తం 150 విగ్రహాలను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ విగ్రహాలను నాయుడుపేట మున్నేరులో నిమజ్జనం చేశారు. గోళ్లపాడు, తీర్థాల, మంగళగూడెం, పోలిశెట్టిగూడెం గ్రామాల విగ్రహలను తీర్థాల ఆకేరులో నిమజ్జనం చేశారు. తల్లంపాడు, పోన్నేకలు, కోండాపుర, ఆరెంపుల తదితర గ్రామాల్లోని విగ్రహాలను ఆయా గ్రామాల చెరువులలో నిమజ్జనం చేశారు. నిమజ్జన కార్యక్రమాన్ని ఏసీపీ తిరుపతిరెడ్డి, కమీషనర్ శ్రీనివాస్ రెడ్డి, తహసీల్దార్ రాంప్రసాద్ పర్యవేక్షించారు.

ఏర్పాట్లు పరిశీలించిన మేయర్

ఖమ్మంకార్పొరేషన్: శనివారం మహా నిమజ్జన కార్యక్రమం నిర్వహించటంతో ఖమ్మంలో ఏర్పాటు చేసిన నాల్గు నిమజ్జన ఘాట్లను మేయర్ పునుకొల్లు నీరజ పరిశీలించారు. ప్రకాశ్‌నగర్, కాల్వొడ్డులో ఏర్పాట్లను తనిఖీలు చేశారు. ఎన్ని విగ్రహాలు వస్తున్నాయి. రాత్రి ఎన్నిగంటల వరకు సమయం పట్టే అవకాశం ఉందని విషయాలను ఈఈ కృష్ణలాల్, డీఈ ధరణిలను అడిగి తెలుసుకున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

బాల సముద్రం చెరువు వద్ద క్రేన్ ఏర్పాటు

నేలకొండపల్లి: నేలకొండపల్లి బౌద్ధస్థూపం వద్ద ఉన్న బాల సముద్రం చెరువు వద్ద ముందు జాగ్రత్త చర్యగా నేలకొండపల్లి పోలీసులు భారీక్రేన్‌ను ఏర్పాటు చేశారు. భారీ విగ్రహాలను బాలసముద్రం చెరువు వద్దకు తేవాలని, చెరువు వద్ద నిమజ్జనానికి ఇబ్బంది లేకుండా క్రేన్‌ను ఏర్పాటు చేసినట్లు నేలకొండపల్లి ఎస్ఐ పెంటరి సంతోష్ చెప్పారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి నిమజ్జన కార్యక్రమం పూర్తిగా, ప్రశాంతంగా సాగింది. పోలీసులు డీజేలకు అనుమతులు ఇవ్వక పోవటంతో శబ్ద కాలుష్యం బాగా తగింది.

గణేష్ నిమజ్జన వేడుకలు

తిరుమలాయపాలెం: మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం గణేష్ నిమజ్జన వేడుకలను ఘనంగా నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. శుక్రవారం మండలంలోని ఆయా గ్రామాల్లో నిమజ్జన వేడుకలు ఘనంగా నిర్వహించారు. పిండిప్రోలు, తిరుమలాయపాలెం, సుబ్లేడు, రఘునాథపాలెం, కాకరవాయి, జూపెడ, బచ్చోడుతండా తదితర గ్రామాల్లో నిమజ్జన వేడుకలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని చెరువులో, ఆకేరు, పాలేరు నదుల్లో గణేష్ విగ్రహాలను నిమజ్జనం చేశారు.

ఘనంగా గణేషుని శోభాయాత్ర

కూసుమంచి: నవరాత్రుల పాటు పూజలందుకున్న వరసిద్ధి.వినాయకుడి నిమజ్జనం శనివారం ఘనంగా జరిగింది. భక్తులు ఆయా గ్రామాల్లోని చెరువుల్లోనే నిమజ్జనం చేశారు. అర్ధరాత్రి వరకు కృష్ణమ్మ ఒడిలో సుమారు 120కుపైగా గణపతుల నిమజ్జనం జరిగింది. కూసుమంచి గంగాదేవిచెరువులోని 20కిపైగా విగ్రహాలతో పరిసరప్రాంతాల్లోని విగ్రహాలను తీసుకవచ్చి నిమజ్జనం చేశారు. దీంతో చెరువుల వద్ద పెద్దఎత్తున భక్తులతో నిండిపోయింది. ఈసందర్భంగా గణనాధులను గ్రామాల్లో శోభాయాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులు నృత్యాలు చేసుకుటూంటూ హోరెత్తించారు. అన్ని వీధులు తిరుగుతూ భక్తిని చాటుకున్నారు.

పోలీస్ బందోబస్తు ఏర్పాటు

కూసుమంచి సర్కిల్ పరిధిలో 20 చెరువులను నిమజ్జనానికి గుర్తించిన అధికారులు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరక్కుండా పోలీస్‌బందోబస్తు ఏర్పాటు చేశారు.నిమజ్జన కార్యక్రమాన్ని కూసుమంచి సీఐ సంజీవ్, ఎస్ఐ నాగరాజు, ఎంపీడీవో రామచంద్రరావు పర్యవేక్షించారు. ఎటువంటి అవాంతరాలు, అవాంఛనీయ సంఘటనలు జరక్కుండా తదితరులు జాగ్రత్తలు తీసుకున్నారు.



ప్రకాశ్‌నగర్ ఘాట్‌లో ఏర్పాట్లు పరిశీలిస్తున్న మేయర్



కొత్తనారాయణపురంలో..



డ్రంకెన్‌డ్రైవ్ టెస్టు నిర్వహిస్తున్న పోలీసులు



గణనాథులను తీసుకెళుతున్న సీపీ సునీల్‌దత్ కుటుంబ సభ్యులు

వెల్లివిరిసిన మత సామరస్యం

వేలంపాటల్లో గణపతి లడ్డూలు దక్కించుకున్న ముస్లిం వ్యాపారి

కామేపల్లి,సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సావాల్లో మత సామరస్యం వెల్లి విరిసింది. ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం పండితాపురం గ్రామంలో పలు చోట్ల వినాయక మండపాలు నెలకొల్పగా.. నవరాత్రుల పాటు ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన ముస్లీం వ్యాపారి షేక్ రబ్బానిపాషా.. మూడు గణేష్ మండపాల వద్ద వేలంపాటల్లో పాల్గొని రూ.10వేలు, రూ.5వేలు, రూ.5వేలచొప్పున మూడు లడ్డూలను దక్కించుకున్నాడు. కులమాతాలకు అతీతంగా ఏటా వినాయక చవితికి విరాళాలు ఇవ్వడంతో పాటు మండపాల వద్ద మహాఅన్నదాన కార్యక్రమాలను నిర్వహిస్తూ ఉండే రబ్బానిపాషా దేవీశరన్నవరాత్రుల్లోనూ ఉత్సాహంగా పాల్గొంటూ ఉంటారు.

కూసుమంచి: జీళ్లచెరువు, కూసుమంచి, చేగొమ్మ, ముత్యాలగూడెం, గట్టుసింగారం, గ్రామాల్లోచెరువుల్లో నిమజ్జన కార్యక్రమం జరిగింది. జీళ్లచెరువులో ముస్లిం సామాజిక వర్గానికి చెందిన షేక్ నాగుల్ మీరా రూ.20వేలతో లడ్డూను వేలంలో దక్కించుకున్నారు. ఇంకా గ్రామాల్లో గణేష్ మండపాలవద్ద ఏర్పాటుచేసిన లడ్డూలకు భక్తులు వేలం ద్వారా దక్కించుకున్నారు.



కామేపల్లి మండలం పండితాపురంలో లడ్డూ అందుకుంటున్న రబ్బాని పాషా



ఆంధ్రజ్యోతి కార్యాలయంలో.. చివరిరోజు పూజలు

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి

» కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
» ముస్తఫానగర్ పీహెచ్‌సీ తనిఖీ

ఖమ్మంకలెక్టరేట్, సెప్టెంబరు6(ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. శనివారం నగరంలోని ముస్తఫానగర్ పట్టణ ఆర్యోగకేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిపుష్టికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. ఓపీ, ఐపీ సేవలు, డ్రగ్ స్టోర్‌ను పరిశీలించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. వైద్యులు నిత్యం అందుబాటులో ఉండేలాగా వైద్యులు, సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది, మందులు, వనరులను కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. పట్టణ ఆరోగ్య కేంద్రాలు సమర్థవంతంగా పనిచేస్తే, ప్రజలకు మరింత దగ్గరిగా వైద్య సేవలు అందడంతో పాటు, జిల్లా కేంద్ర ఆసుపత్రికి రోగుల తాకిడి తగ్గుతుందన్నారు. వైద్యసేవలు అందుబాటులోలేని ప్రాంతాలను గుర్తించి, కొత్త ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారులు కె.రమేష్ ఉన్నారు.



వైద్యులను వివరాలను అడుగుతున్న అనుదీప్

ఖిల్లా, జాఫర్ బావి, రోప్ వే నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్

జిల్లానుపర్యాటక రంగంలో ఉన్నతంగా అభివృద్ధి చేయాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. శనివారం ఖిల్లారోప్‌వే నిర్మాణ ప్రాంతం, జాఫర్‌బావి సుందరీకరణ కోసం మునిసిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్యతో కలిసి పరిశీలించారు. రోప్‌వే నిర్మాణ సంస్థకు పలు సూచనలు చేశారు. కావలసిన వనరులు ఏర్పాటు చేశామని పనులు త్వరితగతిన ప్రారంభించాలని టూరిజం శాఖ అధికారులను ఆదేశించారు. రూ.29కోట్లతో చేపడుతున్న రోప్‌వే నిర్మాణాన్ని వేగవంతం చేయాలన్నారు. కలకత్తాకు చెందిన కన్వేయర్ అండ్ రోప్‌వే సర్వీసెస్ ప్రయివేట్ లిమిటెడ్ నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. రోప్‌వే నిర్మాణానికి స్థలసేకరణ పూర్తి చేసినట్లు, వారంలో పనులు ప్రారంభించాలని కలెక్టర్ సూచించారు. కలెక్టర్ వెంట ఖమ్మంఆర్డీవో గరిడె నర్సింహారావు, జిల్లా పర్యాటక అభివృద్ధి అధికారి సుమన్ చక్రవర్తి, నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ అనిల్ కుమార్, అర్బన్ తహసీల్దార్ సైదులు ఉన్నారు.

నేడు సీసీఏ ఆధ్వర్యంలో సెమినార్

ఖమ్మంఖానాపురంహవేలి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఆదివారం నగరంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో ప్రత్యామ్నాయ పౌరసమూహం(సీసీఏ) ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహిస్తున్నట్లు సీసీఏ సభ్యులు తెలిపారు. ఎన్నికల సంఘం ఎవరి పక్షం, ప్రక్షాళన ప్రారంభంఎక్కడ అనే అంశంపై ఈసెమినార్ జరగనున్నది. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు పరకాల ప్రభాకర్ హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని నగర పురప్రముఖులు, వేధావులు, విద్యావంతులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నవంబరు 23న ఉపకార వేతన పరీక్ష

ఖమ్మంఖానాపురంహవేలి, సెప్టెంబరు6 (ఆంధ్రజ్యోతి): 2025-26 విద్యాసంవత్సరంలో నవంబరు 23న నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు జిల్లా ఇన్‌చార్జ్ విద్యాశాఖ అధికారి, అదనపు కలెక్టర్ పి.శ్రీజ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.పరీక్షలుఉదయం 9:30గంటల నుంచి మధ్యాహ్నం 12:30గంటల వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరీక్ష రుసుం ఓసీ,బీసీ విద్యార్థులకు రూ.100, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ విద్యార్థులకు రూ.50 ఆన్‌లైన్‌లో చెల్లించాలని తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక

తిరుమలాయపాలెం, సెప్టెంబరు6(ఆంధ్రజ్యోతి): మండలంలోని జల్లేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి నలుగురు ఉపాధ్యాయులు ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు అందుకున్నారు. గురుపూజోత్సవం సందర్భంగా ఉత్తమ హెచ్‌ఎంగా దారా రాజేష్, ఉత్తమ ఉపాధ్యాయులుగా పార్థసారధి, ఆకారపు సునీత, ఇనపనూరి రంజిత్‌కుమార్, మరికంటి సురేష్ ఎంపికయ్యారు. వీరు డీఈవో శ్రీజ, ఎమ్మెల్సీశ్రీపాల్‌రెడ్డి , అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి,జడ్పీసీఈవో దీక్షారైనా చేతులమీదుగా అవార్డు అందకున్నారు. వీరిని పలువురు అభినందించారు.

లంబాడీలు ఎస్టీ జాబితాలో ఉండటం చట్టబద్ధమే

మాజీ ఎంపీటీసీ, లంబాడా నాయకుడు బాలాజీ

కూసుమంచి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో లంబాడీలను ఎస్టీ జాబితాలో ఉండడం చట్టబద్ధమేనని మాజీ ఎంపీటీసీ సభ్యులు జర్పుల బాలాజీ దెలిపారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ రాజకీయ లబ్ధికోసమే కోయ, లంబాడీల మధ్య చిచ్చుపెడుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ప్రజలకు గిరిజనులకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా తెగలమధ్య వైరుధ్యం కల్పించి కాలాయాపన చేయాలని కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. అందత్కర్ కల్పించిన రాజ్యాంగాన్ని రక్షించుకోవడమేనన్నారు. గిరిజన తండాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న బాలాజీ

సీపీఎం నాయకుడు రమేశ్ హఠాన్మరణం

ఖమ్మంసంక్షేమవిభాగం,సెప్టెంబరు6(ఆంధ్రజ్యోతి): సీపీఎం నాయకుడు నర్రా రమేశ్ (58) గుండెపోటుతో శనివారం మృతి చెందారు. ఆయన మరణం తీర్చలేనిదని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు నివాళులర్పించారు.

తెల్దారుపల్లిలో సానుభూతిపరుడుడ

ఖమ్మంరూరల్,సెప్టెంబరు6(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తెల్దారుపల్లి గ్రామానికి చెందిన సీపీఎం సానుభూతిపరుడు మల్లెబోయిన లక్ష్మయ్య (66) అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, మండల కార్యదర్శి సుదర్శన్ రెడ్డి, జిల్లా నాయకులు తమ్మినేని కోటేశ్వరరావు లు లక్ష్మయ్య మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు.

అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేయాలి: సబ్ కలెక్టర్

సత్తుపల్లి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తిని సాధిస్తూ సంస్థ అభివృద్ధితోపాటు ఉద్యోగులు, కార్మికుల సంక్షేమం కోసం పనిచేయాలని కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్‌యాదవ్ అన్నారు. శనివారం ఆయన మండలంలోని కిష్టారం ఓసీని సింగరేణి డైరెక్టర్ (పీపీ) కె.వెంకటేశ్వర్లుతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఓసీలోని ఉద్యోగులు, కార్మికులకు అందుతున్న సేవలు, రక్షణ సూత్రాలు పాటిస్తున్నారా లేదా అని పరిశీలించారు. ఆయన వెంట కొత్తగూడెం ఏరియా జీఎం షాలెంరాజు, సత్తుపల్లి తహసీల్దార్ సత్యనారాయణ, సింగరేణి అధికారులు సీహెచ్.రామకృష్ణ, కోటిరెడ్డి, ఎన్వీఆర్.ప్రహ్లాద్, సోమశేఖరరావు, మదన్‌మోహన్, బుడగం రామకృష్ణ, రమణరెడ్డి, పీ.తౌర్య, గోపీకిషోర్, డీ.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం



విశ్రాంత ఉపాధ్యాయులను సన్మానిస్తున్న జిల్లా అధ్యక్షుడు చందర్‌రావు

కల్లూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో శనివారం కల్లూరులో ఘనంగా గురుపూజోత్సవం జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులైన సముద్రాల పుల్లారావు, దార రామారావులను ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పసుమర్తి చందర్‌రావు శాలువలు కప్పి ఘనంగా సన్మానించారు. ఇప్పటి వరకు జిల్లాలో తమ సంఘం తరుపున 200 మంది ఉపాధ్యాయులను సత్కంరిచామని ఆయన చెప్పారు. సమాజంలో ఇలాంటి సేవ కార్యక్రమాలకు చేయూతనిచ్చి ఆర్యవైశ్యులంత ఐక్యతను చాటి చెప్పాలని ఆయన పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి పలువురు ఘన మైన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు దోసపాటి కృష్ణార్జునరావు, కె బలారాం, చారుగుండ్ల సందీప్, కాటేపల్లి రజనీ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ లైన్లు పునరుద్ధరించాలని ఆందోళన

బోనకల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామ సమీపంలో ఐదు నెలల క్రితం గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణ పనుల్లో భాగంగా తొలగించిన విద్యుత్ లైన్లను పునరుద్ధించాలని డిమాండ్ చేస్తూ శనివారం క్రాస్ రోడ్డు వద్ద అఖిలపక్ష నాయకులు ఆందోళన నిర్వహించారు. విద్యుత్ లైన్లు తొలగించడం వల్ల రైతుల వ్యవసాయ మోటర్లకు విద్యుత్ సరఫరా లేక నీటి ఎద్దడితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల చుట్టు తిరిగినా ప్రయోజనం లేకపోయిందని వాపోయారు. తక్షణమే తమ సమస్యను పరిష్కరించాలని కోరారు. అఖిలపక్ష నాయకులు యంగల ఆనందరావు, కొంగర జగన్, వంగాల నరసింహ, పెద్దప్రోలు సైదులు, గాదె నర్సోత్తమ రెడ్డి, ఏనుగు రవి, వంగాల రామకృష్ణ, సాదినేని సురేష్ పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ ర్యాంకర్లకు సన్మానం



మాధురి, మేఘనలను సన్మానిస్తున్న దృశ్యం

వైరా, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెబ్బవరం బీసీ కాలనీ ప్రాథమిక పాఠశాల పూర్వ విద్యార్థులైన ట్రిపుల్ ఐటీ ర్యాంకర్లు తిరుమలదాసు మాధురి, సిరిగిరి మేఘనలను శనివారం పాఠశాలలో ఘనంగా సన్మానించారు. మేఘన 574మార్కులతో జిల్లాస్థాయిలో నాల్గో ర్యాంకు, మాధురి 572మార్కులతో జిల్లాస్థాయిలో ఐదో ర్యాంకు లభించటం పట్ల బీసీ కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. ఆ ఇద్దరిని శాలువాతో సన్మానించి మెమోంటోలు, డిక్షనరీలు బహూకరించారు. ఆపాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రకాశం, ఏఏపీసీ కమిటీ చైర్మన్ కొత్తా లక్ష్మీ, ఉపాధ్యాయులు సుధాకర్, బాలాజీ పాల్గొన్నారు.

ఘనంగా మువ్వా జన్మదిన వేడుకలు



సత్తుపల్లి రింగ్‌సెంటర్‌లో కేక్ కట్‌చేసిన అభిమానులు

సత్తుపల్లి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): టీజీఐడీసీ చైర్మన్ మువ్వా విజయబాబు జన్మదిన వేడుకలను శనివారం సత్తుపల్లిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రింగ్‌సెంటర్, మువ్వా క్యాంప్ కార్యాలయంలో బర్త్‌డే కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిన అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులు పండ్లు, రొట్టెలను అందజేశారు. కార్యక్రమంలో కూకలకుంట నాని, బాల పుల్లయ్య, కంచర్ల నాగేశ్వరరావు, కొప్పుల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కల్లూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నూరు గ్రామంలో మువ్వా యూత్, కాంగ్రెస్ ఆధ్వర్యంలో శనివారం టీజీఐడీసీ చైర్మన్ మువ్వా విజయబాబు జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేసిన కాంగ్రెస్ నాయకులు, అభిమానులు మువ్వాకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు ఉపేంద్ర, నారాయణరావు, రాజేష్, శ్రీకాంత్‌రెడ్డి, రాంభద్రరావు, వంశీ పాల్గొన్నారు.



చెన్నూరులో విజయబాబు జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న మువ్వా యూత్

కోలాహలంగా గణేష్ నిమజ్జనాలు

వైరా, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వైరాలో శనివారం వినాయక విగ్రహాల నిమజ్జనం కోలాహలంగా జరిగింది. ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ నిమజ్జన ఊరేగింపును ప్రారంభించి స్వయంగా ట్రాక్టర్ నడిపి ఉత్సవ కమిటీ సభ్యులను ఉత్తేజపరిచారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఏదునూరి సీతరాములు, బోళ్ల గంగారావు, చెరుకూరి కిరణ్, పమ్మి అశోక్, కట్ల సంతోష్ తదితరులు ఎమ్మెల్యేతో పాటు నిమజ్జన ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్నారు. వైరా తహసీల్దార్ కేవీ.శ్రీనివాసరావు, కమిషనర్ యు.గురులింగం, వైరా ఏసీపీ ఎంఏ.రెహ్మాన్, సీఐ ఎన్.సాగర్, ఎస్ఐ పి.రామారావు, అగ్నిమాపకశాఖ అధికారి నర్వనేని శ్రీనివాసరావు, పీహెచ్‌సీ డాక్టర్ లక్కినేని శ్రీహర్ష, పిషరీస్ అధికారి శివప్రసాద్ ఆధ్వర్యంలో బందోబస్తు మధ్య నిమజ్జనాలు నిర్వహించారు.

ముదిగొండ: మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యువత నృత్యాలు చేస్తూ ఊరేగింపులో పాల్గొన్నారు. అనంతరం వినాయక విగ్రహాలను ఆయా గ్రామాల్లో చెరువుల్లో నిమజ్జనం చేశారు.

సత్తుపల్లి: వినాయక చవితి సందర్భంగా పట్టణ శివారులోని శ్రీ ప్రసన్న గణపతి లడ్డూను మండపాటి కేశవరెడ్డి రూ.4.5లక్షలకు దక్కించుకున్నారు. అదేవిధంగా 16వ వార్డు వాసవీ గణపతి లడ్డూను సోమిశెట్టి శ్రీధర్ రూ. 1.11లక్షలకు దక్కించుకున్నారు.



ఊరేగింపులో ట్రాక్టర్ నడుపుతున్న ఎమ్మెల్యే రాందాస్



ముదిగొండలో వినాయక విగ్రహ ఊరేగింపు దృశ్యం

కష్టపడి చదివితే.. తలెత్తుకోవచ్చు: ఎమ్మెల్యే

సత్తుపల్లిరూరల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలో తలదించుకుని కష్టపడి చదివితే భవిష్యత్తులో తలెత్తుకోవచ్చునని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. సత్తుపల్లి పట్టణంలోని తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలలో ఇన్‌స్పైర్, ఇగ్నైట్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు మోటివేషన్ కార్యక్రమం నిర్వహించారు. వ్యక్తిగతంగా పాఠశాలల అభివృద్ధి, మౌళిక వసతులను కల్పిస్తున్నామని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతిపేద కుటుంబ ఆర్థిక స్థితిగతులను మార్చగలిగే శక్తి కేవలం చదువుకే ఉందని, ఆ చదువుని స్థిరాస్తిగా భావించి ప్రతిఒక్క విద్యార్థి మంచిమంచి విజయాలు సాధించి ఉన్నతంగా రాణించాలని ఆకాంక్షించారు. తాముకూడా పేద కుటుంబంలో జన్మించి నేడు నియోజకవర్గానికి శాసనసభ్యురాలిగా ఎదిగానని, మీరు కూడా ఒక లక్ష్యాన్ని నిర్ణయించుకుని సాధించేవరకు శక్తివంచన లేకుండా శ్రమించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్, ప్రిన్సిపాల్ వెంకట్రామయ్య, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి

ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు

మధిర,సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మధిర టీవీఎం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మండల ఇన్‌చార్జీ ఎంఈఓ వై.ప్రభాకర్ గురోపూజోత్సవం సందర్భంగా జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రధానోపాధ్యాయునిగా ఎంపిక అయ్యారు. శనివారం ఖమ్మం కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీజ ప్రభాకర్‌ను సన్మానించి అవార్డు అందజేశారు.

బోనకల్: మండలంలోని రావినూతల ప్రధానోపాధ్యాయుడు, ప్రస్తుత మండల విద్యాశాఖాధికారిగా విధులు నిర్వర్తిస్తున్న దామాల పుల్లయ్యకు ఉత్తమ హెచ్‌ఎంగా కలెక్టర్ కార్యాలయంలో శనివారం ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి, అదనపు కలెక్టర్ శ్రీజ, శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా ప్రశంసాపత్రం, మెమోంటోలను అందుకున్నారు.

ఏన్కూరు: గంగుల నాచారం ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయుడు బానోతు గోపి విద్యాభివృద్ధికి విశేష కృషిచేస్తున్నారు. ఈమేరకు శనివారం గురుపూజోత్సవం సందర్భంగా కలెక్టర్ కార్యాలయంలో డీఈవో శ్రీజ చేతులమీదుగా మెమోంటోతోపాటు ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. 2024లో బదిలీపై వచ్చిన గోపి ఈపాఠశాలపై ప్రత్యేక దృష్టిపెట్టారు. అలాగే మూలపోచారం గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు డీఎస్ నాగేశ్వరరావు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడుగా ఎంపికయ్యాడు. ఈమేరకు శనివారం గురుపూజోత్సవం సందర్భంగా భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో పీవో రాహుల్, డిప్యూటీ డైరెక్టర్ మణెమ్మ చేతులమీదుగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు.

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేస్తున్న వెల్లంకి నాగరాజు మండల నుంచి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడుగా ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా డీఈవో శ్రీజ పురస్కారాన్ని అందించి సన్మానించారు.



ప్రభాకర్‌ను సన్మానిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ

ముత్యాల కవచాలంకరణలో జమలాపురం శ్రీవారు

ఎర్రుపాలెం, సెప్టెంబరు6 (ఆంధ్రజ్యోతి): మండలంలో తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధి గాంచిన శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు శ్రీవారికి శనివారం సర్వాంగాభిషేకం నిర్వహించి, ముత్యాల కవచాన్ని అలంకరించారు.. ఆలయ అర్చకుడు ఉప్పల శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో తెల్లవారుజామున పంచామృతాలు, సుగంధద్రవ్యాలతో సర్వాంగాభిషేకం నిర్వహించి ముత్యాల అలంకారంలో భక్తులకు దర్శనం కలిపించారు. శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీవారి ఉత్సవాలను పల్లకీలో ఊరేగించి కళ్యాణ వేదిక వద్దకు చేర్చి నిత్యకళ్యాణం నిర్వహించారు. భక్తులు పాలు, పొంగళ్లను శ్రీవారికి నివేదించారు. భక్తులు నూతన వాహనాలకు పూజాది కార్యక్రమాలు నిర్వహించుకుని తమ నూతన వాహనాలతో గిరి ప్రదక్షిణలు చేశారు. శ్రీవారి ఆలయంతో పాటు భక్తులు ఉపాలయాలను దర్శించుకున్నారు. శ్రీవారిని దర్శించుకున్న భక్తులకు ఆలయ సిబ్బంది ఉచితంగా అన్న వితరణ చేశారు. ఆలయ ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, సీనియర్ అసిస్టెంట్ సోమయ్య, జూనియర్ అసిస్టెంట్ ఇరుకులపాటి కృష్ణప్రసాద్, అర్చకులు రాజీవ్‌శర్మ, మురళీమోహన్‌శర్మ, దేవాలయ అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైరా అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి

▸ సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ వినతి



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

వైరా, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అత్యధిక గిరిజన ప్రాంతమైన వైరా నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన నిధులను మంజూరు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ కోరారు. శనివారం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని తన స్వగృహంలో సీఎం రేవంత్‌రెడ్డిని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, గిరిజన నాయకులతో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వైరా నియోజకవర్గంలోని సమస్యలను వివరిస్తూ ముఖ్యమంత్రికి ఎమ్మెల్యే ఒక వినతిపత్రం సమర్పించారు. వైరా మునిసిపాలిటీకి రూ.వంద కోట్ల నిధులు వెంటనే మంజూరు చేయాలని కోరారు. అదేవిధంగా నియోజకవర్గంలో దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న రోడ్లు, వంతెనల నిర్మాణం, విద్యా, వైద్య అభివృద్ధికి అవసరమైన నిధులు ఎక్కువ మొత్తంలో నిధులు మంజూరు చేసి నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

రైతులకు తప్పని యూరియా తిప్పలు

తల్లాడ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కేంద్రం తెలంగాణకు తగినంత యూరియా సరఫరా చేసినా రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందించకుండా బ్లాక్ మార్కెట్‌కు తరలించడం వల్లే రైతులు తీవ్రంగా ఆవేదన చెందుతు రోడ్ల మీదకు రావాల్సిన దుస్థితి వచ్చిందని బీజేపీ ఖమ్మం పార్లమెంటరీ నియోజకవర్గ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు ఆరోపించారు. శనివారం తల్లాడ మండలంలోని అన్నారుగూడెం గ్రామంలో వరిపైర్లను బీజేపీ ప్రతినిధుల బృందం పరిశీలించింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోనే అత్యధికంగా వరిసాగు చేసే తల్లాడ మండలంలోనే యూరియా కొరత రావడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. రైతులను మోసం చేయడమే కాకుండా తమ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవడానికి కేంద్రంపై ఆరోపణలు చేయడం శోచనీయమన్నారు. జిల్లా నాయకులు అపతి వెంకటరామారావు, గాదే కృష్ణారావు, మండల ప్రధాన కార్యదర్శి పెరికే కిరణ్, నాగేశ్వరరావు కృష్ణ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ అలసత్వంతోనే కొరత

వైరా, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం సకాలంలో రాష్ట్రాలకు అవసరమైన యూరియా సరఫరా చేయడంలో అలసత్వాన్ని ప్రదర్శిస్తుందని తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు విమర్శించారు. మండలంలోని విప్పలమడక గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగిన సీపీఎం నాయకుడు గరిడేపల్లి వెంకటేశ్వర్లు 20వ వర్ధంతి సభలో రాంబాబు ప్రసంగించారు. యూరియా కోసం క్యూలైన్లలో నిలబడే రైతులను తాగుబోతులు, పనికి మాలిన వాళ్లుగా సంబోధించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మాజీ సర్పంచ్‌లు పారుపల్లి కృష్ణారావు, తుమ్మల జాన్‌పాపయ్య, సీపీఎం మండల కార్యదర్శి బాణాల శ్రీనివాసరావు, గరిడేపల్లి సతీమణి దుర్గమ్మ, కుమారుడు శ్రీనివాసరావు, సీపీఎం గ్రామశాఖ కార్యదర్శి గరిడేపల్లి సుబ్బారావు, తూము సుధాకర్ పాల్గొన్నారు.

వేంసూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గడచిన 22రోజులుగా రైతులు ఎదురుచూస్తున్న యూరియా కొరతకు ఎట్టకేలకు మోక్షం లభించింది. ఈమేరకు శనివారం వేంసూరు సొసైటీకి 400యూరియా కట్టలు వచ్చాయి. ఇప్పటికే 800మంది రైతులు వారి పాస్‌పుస్తకాలను సీరియల్‌లో పెట్టారు. ఆదివారం ఏఈవోలు సీరియల్ ప్రకారం కూపన్లు రాసి సాయంత్రానికి ఒక్కో రైతుకు ఒక కట్ట చొప్పున యూరియాను పంపిణీ చేయనున్నట్లు సొసైటీ సిబ్బంది తెలిపారు. తమకు ఈ కట్టలు ఎటూ సరిపోవని రైతులు వాపోతున్నారు.

పన్నుల స్లాబు తగ్గింపుతో సామాన్యుడికి భారీ ఊరట

మధిర, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జీఎస్‌టీ పన్నుల స్లాబు తగ్గింపుతో ప్రధాని నరేంద్ర మోదీ సామాన్యుడికి భారీ ఊరట కల్పించి పేదల పెన్నిదిగా నిలిచారని బీజేపీ మధిర నియోజకవర్గ కన్వీనర్ ఏలూరి నాగేశ్వరరావు అన్నారు. శనివారం మధిరలోని తెలంగిణ తల్లి విగ్రహం వద్ద జీఎస్‌టీ పన్నుల తగ్గింపుకు నిర్ణయం తీసుకున్నందుకు బీజేపీ నాయకులు కార్యకర్తలు ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ప్రధాని హెల్త్ ఇన్సూరెన్స్, పర్సనల్ ఇన్సూరెన్స్‌లపై జీఎస్‌టీని పూర్తిగా ఎత్తివేయడంతో సామాన్యుడికి భారీ ఊరట లభించిందని అన్నారు. ప్రధాని నిర్ణయాలతో దేశం వికసిత్ భారత్ వైపు పయనిస్తుందని ప్రపంచంలో భారత్ అగ్రగామి దేశం గా త్వరలో నిలవనుందని అన్నారు. బీజేపీ పట్టణ, రూరల్ అధ్యక్షులు శివరాజు సుమంత్, గడ్డం శ్రీహరి, నాయకులు పెరుమాళ్లపల్లి విజయరాజు, చిలివేరు సాంబ, రమేష్, రామిశెట్టి నాగేశ్వరరావు, కృష్ణారావు, వేణు, శ్రీను, అర్జునరావు పాల్గొన్నారు.

సిరులగని.. సింగరేణి



లైట్ మోటార్ వెహికల్ రిపేర్ షెడ్‌ను ప్రారంభిస్తున్న డైరెక్టర్ వెంకటేశ్వర్లు

▸ ఎప్పటికప్పుడు వాహనాలను కండీషన్‌లో ఉంచాలి

▸ సింగరేణి డైరెక్టర్ (పీపీ) కొప్పుల వెంకటేశ్వర్లు

సత్తుపల్లిరూరల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ బొగ్గు రంగంలోనే కాకుండా విద్యుత్, సోలార్ విద్యుత్, బంగారం, రాగివంటి ఖనిజాల అన్వేషణలో రానిస్తోందని ఆ సంస్థ డైరెక్టర్(పీపీ) కొప్పుల వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం ఆయన సత్తుపల్లి పట్టణంలోని జేవీఆర్ ఓసీలో రూ. కోటి వ్యయంతో నూతనంగా నిర్మించిన లైట్ మోటార్ వెహికల్ రిపేర్ షెడ్‌ను ప్రారంభించారు. ఉద్యోగులంతా ఈ ఏడాది నిర్దేశించిన 72మిలియన్ టన్నుల బొగ్గును రక్షణతో తీయాలని, అదేవిధంగా క్వాలిటీ బొగ్గును ఉత్పత్తి చేసి వినియోగదారులకు రవాణా చేయాలన్నారు. ఏదైన చిన్న సమస్య వచ్చినపుడు వెంటనే సరిచేసుకోవాలని, ఎప్పటికప్పుడు వాహనాలను కండీషన్‌లో ఉంచితే సంస్థకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉండదన్నారు. ఏదైనా వాహనం రిపేర్‌కు వస్తే త్వరితగతిన రిపేర్ చేసి ఇవ్వాలని, ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరీక్షించి ఫిట్‌నెస్ ఇవ్వాలని సూచించారు. వాహనాలు నడిపేటప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం సీఏచ్‌పీ, స్టోర్ వద్ద క్రషర్లను సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కొత్తగూడెం ఏరియా జీఎం షాలెంరాజు, పీవోలు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ ప్రధాన పైప్‌లైన్ లీక్



కల్లూరులోని సత్తెరుకుంట చెరువు భాగంలో పైప్‌లైన్ లీక్‌తో నీరు కలుషితమవుతున్న దృశ్యం

కల్లూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కల్లూరులోని సత్తెరుకుంట చెరువు భాగంలో మిషన్ భగీరథ ప్రధాన పైప్‌లైన్ లీకేజీతో గడచిన పది రోజులుగా పలు మండలాల పరిధిలో గల గ్రామాలకు కలుషిత తాగునీరు సరఫరా జరుగుతోంది. ఈ చెరువు భాగంలో (700 ఎంఎం) పైప్‌లైన్ లీకేజీతో సమాచారం అందుకున్న భగీరథ అధికారులు ఎట్టకేలకు గత రెండు రోజుల నుంచి సదరు పైప్‌లైన్ నుంచి మంచినీటి సరఫరాను నిలిపివేశారు. పైప్‌లైన్ లీకేజీతో కలుషిత నీటిని తాగిన ప్రజలు శరీరంపై భాగంలో దురదలు రావటం, దద్దుర్లు ఏర్పడటమేకాకుండ అనారోగ్యంతో బాధపడుతన్నట్లు సమాచారం. ఇంత జరుగుతున్న పది రోజులుగా ప్రధాన పైప్‌లైన్ లీకేజీ అవుతున్న అధికారుల దృష్టికి రాక పోవటం విడ్డూరంగా ఉంది. తల్లాడ మండలంలోని గూడూరు గుట్టలపై గల మిషన్ భగీరథ ప్రాజెక్టు శుద్ధి కేంద్రం నుంచి కల్లూరు, పెనుబల్లి, వేంసూరు మండలాలకు మిషన్ భగీరథ నీరు సరఫరా అవుతోంది. సత్తెరుకుంట చెరువులో కల్లూరు పట్టణంలోని ప్రధాన రహదారుల నుచి అనేక వ్యర్థాలతో కూడిన మురికి నీరు చేరి నీరంతరం కలుషితం కాగా, భగీరథ నీటి సరఫరా సమయంలో సుమారు 2 గంటల పాటుగా విద్యుత్ సరఫరా నిలిచి పోవడంతో భగీరథ పైప్ లైన్‌లోకి నీరు చేరి నీరంత కలుషితం అవుతోంది. ఇప్పటికైన అధికారులు స్పందించి సత్వరమే ప్రధాన పైప్‌లైన్ లీకేజీ పూడ్చి వేత పనులు చేపట్టి శుద్ధిజల నీరు సరఫరా జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై కల్లూరు భగీరథ ప్రాజెక్టు ఇంజనీర్ శివనీ వివరణ ఇస్తూ సత్వరమే పైప్‌లైన్ లీకేజీ పూడ్చివేత పనులు పూర్తి చేయటం జరుగుతుందన్నారు.

ఓటర్ల ముసాయిదా జాబితా ప్రదర్శన

బోనకల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయం, గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో శనివారం ఓటర్ల ముసాయిదా తుది జాబితాను ఎంపీడీవో ఆర్.రమాదేవి, పంచాయతీ కార్యదర్శులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలంలోని 22 గ్రామాలకు సంబంధించి ఓటర్ల జాబితాలో అభ్యంతరాలు ఉంటే ఈ నెల 8వ తేది లోపు లిఖిత పూర్వకంగా ఆయా గ్రామాల కార్యదర్శులకు అందజేయాలన్నారు.

అంకితభావంతో పనిచేస్తే మెరుగైన ఫలితాలు

▸ కలెక్టర్ అనుదీప్



ఎంఈవోను సన్మానిస్తున్న శ్రీజ

సత్తుపల్లిరూరల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అంకితభావంతో పనిచేస్తే మెరుగైన ఫలితాలు సాధించవచ్చని సత్తుపల్లి మండలంలోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు నిరూపించారని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్ పీ.శ్రీజలు అన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని శనివారం జిల్లా కేంద్రంలో ఘనంగా సన్మానించారు. అట్టడుగు వర్గాల నుంచి వచ్చే విద్యార్థులకు మంచి ఫలితాలు సాధించేలా విశేష ప్రయత్నం చేయడంతోనే ఇలాంటి విజయాలు సాధించవచ్చని అన్నారు. అదేవిధంగా 100శాతం ఫలితాలతో పాటు ఎన్‌ఎంఎంఎస్‌లో సీట్లను విద్యార్థులు సాధించడంలో ఉపాధ్యాయుల కృషి ఉందని, ఇలాంటి ఉపాధ్యాయులను ఆదర్శంగా తీసుకుని మిగతా వారుకూడా రాణించాలని కోరారు. సన్మానం పొందిన వారిలో ఎంఈవో నక్కా రాజేశ్వరరావు, ఏఎల్‌వీ.రాంబాబు (కిష్టారం), ఎం.సత్యనారాయణ, ఎన్.రమేష్, రమాకుమారి, థెరిసా (కాకర్లపల్లి), నాగమణి, యాకూబ్, వేము రత్నాకర్ (సత్తుపల్లి), ఎండి. ఆదిల్‌షరీఫ్ (రేజర్ల)ఉన్నారు.

ప్రమాదకరంగా టీఎల్ పేట చప్టా

▸ ప్రమాదం జరగకముందే చప్టా నిర్మించాలని గ్రామస్థుల వినతి



ఏన్కూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఏన్కూరు వయా తిమ్మారావుపేట మీదుగా ఖమ్మం వెళ్లే రహదారి టీఎల్‌పేట సమీపంలోని చప్టా ప్రమాదకరంగా మారింది. ఏ క్షణమైనా కూలి పెద్దప్రమాదం జరిగే అవకాశం ఉంది. వర్షాకాలంలో చెరువు అలుగు ద్వారా వరద ఉధృతంగా ప్రవహిస్తుంది. ఈ వరద ధాటికి చప్టా పూర్తిగా కొట్టుకుపోయే ప్రమాదం ఉంది. ప్రమాదం జరగకముందే చప్టా నిర్మించాలని గ్రామస్థులు అధికారలను కోరుతున్నారు. ప్రమాదకరంగా ఉన్న చప్టా నిర్మాణంలో ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు నిర్లక్ష్యవైఖరి వ్యవహరిస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. సుమారు 50 ఏళ్ల క్రితం నిర్మించిన చప్టా శిథిలావస్థకు చేరింది. ఈవిషమై అనేకసార్లు ఎంపీపీ వరలక్ష్మి, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కలెక్టర్ సుమారు 2కోట్లు మంజూరు చేశారు. నిధులు మంజూరు చేసి రెండేళ్లు గడుస్తున్నా నేటికి పనులు ప్రారంభించలేదు. ఈరహదారి గుండా కేసుపల్లి, బురదరాఘవాపురం, లచ్చగూడెం, శ్రీరామగిరి, ఆరికాయలపాడు మూలపోచారం, తిమ్మారావుపేట, రంగాపురం, రాయమాధారం, సూర్యతండా మర్లకుంట, మద్దులపల్లి గ్రామాలతోపాటు ఖమ్మం ఇల్లెందుకు నిత్యం వేలాది వాహనాలు ప్రయాణిస్తున్నాయి. రాత్రిపూట ఏ ప్రమాదం జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటూ వాహనదారులు ప్రయాణిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి చప్టా నిర్మించాలని కోరుతున్నారు.